
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
ఆదివారం 9 నవంబరు 2025



ఎంజాయ్‌మెంట్
సర్వే షురూ

- భూభారతిలో మరో ముందడుగు
- రీసర్వే కోసం ఎర్రుపాలెం మండలంలో నాలుగు రెవెన్యూ పైలెట్ గ్రామాల ఎంపిక

8



ఇదిగో.. అల్లుళ్ల రాజ్యం!

సండే స్పెషల్
SUNDAY SPECIAL




మోడల్‌కాలనీలో స్థిరపడిన పేరాయిగూడెం అల్లుళ్లు

- వారి అడ్డాగా మారిన మోడల్ కాలనీ
- పేరాయిగూడెం అమ్మాయిలను వివాహమాడిన వారంతా ఇక్కడే నివాసం
- కూలీలు, డ్రైవర్లు, చేతివృత్తుల వారే అధికం

ఆ కాలనీ పేరు మోడల్ కాలనీ. కానీ అందరూ దానిని అల్లుళ్ల కాలనీగా పిలుస్తుంటారు. ఈ పిలుపు ఏదో సరదాగా వచ్చింది కాదు.. దాని వెనుక ఓ ప్రత్యేకత ఉంది. వివిధ గ్రామాలకు చెందిన అబ్బాయిలు.. పేరాయిగూడెం అమ్మాయిలను వివాహం చేసుకొని ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటుంటారు. అందుకే ఆ కాలనీకి మోడల్ కాలనీగా పేరురాగా.. అక్కడ ఉన్న వారిలో అధికశాతం మంది ఆ ఊరి అల్లుళ్లే ఉండటంతో అందరూ ముద్దుగా పిలుస్తుంటారు. అశ్వారావుపేట మునిసిపాలిటీ పరిధిలో పేరాయిగూడేన్ని ఆనుకొని ఉన్న ఈ మోడల్‌కాలనీలో దాదాపు 150 కుటుంబాలు నివసిస్తుండగా.. అవన్నీ చిన్న కుటుంబాలే. వ్యవసాయ, ఇతర రంగాల్లో కూలి పనులతో పాటు పలు రకాల చేతివృత్తులు చేసుకునే వారే అధికంగా ఉన్నారు. మొత్తంగా అల్లుళ్ల కాలనీగా పేరొందిన మోడల్ కాలనీ గురించి ఆదివారం ప్రత్యేక కథనం.

7

-ఆంధ్రజ్యోతి, అశ్వారావుపేట



అల్లుళ్ల కాలనీ వ్యూ

అక్కడి ఎన్నికకు..
ఇక్కడి నేతలు



- జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారంలో మంత్రులు బిజీబిజీ
- విపక్ష నేతలు కూడా రాజధానిలోనే మకాం

ఖమ్మం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర రాజధానిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉపఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి అధికార, విపక్షపార్టీలనేతలు అక్కడికి తరలారు. తమ పార్టీల విజయం కోసం పోటాపోటీగా ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు ఓ వైపు మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు విపక్ష బీఆర్ఎస్ నేతలు హైదరాబాదులోనే మకాం వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపునకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖమంత్రి తుమ్మలనాగేశ్వరావు, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరావు, మువ్వా విజయ్‌బాబు, మార్క్‌ఫెడ్ మాజీవైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఉవ్వాళ్ల దుర్గాప్రసాద్, తదితరులు ప్రచారంలో ఉన్నారు. ఆయా సామాజికవర్గాల ఓట్లను దృష్టిలో ఉంచుకుని కొన్ని కార్పొరేషన్ డివిజన్లను ఆ నేతలకు కేటాయించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జూబ్లీహిల్స్‌లో పలు డివిజన్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోకలిసి విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. కొన్నిరోజులుగా హైదరాబాదులోనే మకాం వేసిన ఆయన కీలక బాధ్యతలు చూస్తున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా పలు డివిజన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా (మిగతా 6వ పేజీలో)

అట్టహాసంగా..



క్రీడా పతాకం ఎగరేస్తున్న ఎమ్మెల్యే పాయం, పక్కన కలెక్టర్, ఎస్పీ

- ప్రారంభమైన పాఠశాలల క్రీడా సమాఖ్య 69వ రాష్ట్ర స్థాయి క్రీడలు
- హాజరైన ఎమ్మెల్యే పాయం, భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ
- గౌరవ వందనం సమర్పించిన క్రీడాకారులు
- ఏడూళ్లబయ్యారంలో సందడి
- తొలిరోజు సత్తా చాటిన ఉమ్మడి ఖమ్మం జట్టు

7

వైరాలో ముగిసిన గురుకుల క్రీడలు

ఓవరాల్ విజేతలుగా ఇల్లెందు, వైరా

కమ్యూనిస్టులకు
ప్రాణత్యాగాలు కొత్తకాదు

- ఉద్యమాన్ని దెబ్బతీసేందుకే సామినేని హత్య
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- పాతర్లపాడులో రామారావు సంతాపసభ
- హాజరైన తమ్మినేని, పోతినేని, బాగం తదితరులు

6



సామినేని రామారావు సంతాపసభలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు, వేదికపై తమ్మినేని, పోతినేని, బాగం, తదితరులు

ముగిసిన బొగ్గుట్ట గనుల ప్రస్థానం

- నిల్వలు పూర్తవడంతో ఇల్లెందు జేకే 5 ఓసీ మూత
- 13 ఏళ్లపాటు నిక్షేపాలు అందించిన ఓసీ

ఇల్లెందు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందులో ఏకైక బొగ్గు గని సింగరేణి కాలరీస్ జేకే 5 ఓపెన్ కాస్ట్ బొగ్గుగనిని మూసివేశారు. సంవత్సరం కాదు.. రెండేళ్లు కాదు.. ఏకంగా 13 ఏళ్లుగా బొగ్గు నిక్షేపాలు అందించిన జేకే 5 ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు నిక్షేపాలు పూర్తి కావడంతో గనిని మూసివేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. గనిలో పనిచేస్తున్న కార్మికులు, ఆపరేటర్లు, ఇతర సిబ్బందిని అధికారులు వివిధ ఏరియాలకు, సమీపంలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌కు బదిలీ చేస్తున్నారు. సింగరేణి బొగ్గు గనులకు జన్మనిచ్చిన ఇల్లెందు ఏరియాలో గత కొద్ది సంవత్సరాలుగా సింగరేణి ఉనికిని కాపాడుతున్న జేకే 5 ఓపెన్ కాస్ట్ బొగ్గుగనిని సైతం శనివారం మూసి వేయడంతో.. ఇల్లెందులో బొగ్గు ఉత్పత్తులు అందించే గనుల ప్రస్థానం ముగిసినట్లైంది. జేకే 5 బొగ్గుగని విస్తరణ కోసం పూసపల్లి ఏరియాలో ఓపెన్ కాస్ట్ ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం తీవ్రంగా కృషి చేసినప్పటికీ.. ప్రయోజనం లేకుండా పోయింది. పూసపల్లి ఏరియాలో ఓపెన్ కాస్ట్ తవ్వకాలకు అనేక సమస్యలు ఉత్పన్నం కావడంతో.. వాటి పరిష్కరించడం అసాధ్యంగా మారడంతో సింగరేణి యాజమాన్యం అనివార్యంగా స్థానిక జేకే 5 ఓసీ కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీలు చేస్తూ సర్దుబాటు చర్యలు చేపట్టింది. పూసపల్లి ఓసీ ఏర్పాటుకు పబ్లిక్ హియరింగ్‌లలో ప్రజామోదం, బొగ్గుగనుల మైనింగ్ సేఫ్టీ అధికారుల అనుమతులు, పర్యావరణ అనుమతులు లభించినప్పటికీ.. పూసపల్లి సమీపంలోని ప్రతిపాదిత ఓసీ ప్రభావిత ప్రాంతంలో నివసిస్తున్న వారికి చెందిన 20ఎకరాల భూమికి సంబంధించిన సమస్య జఠిలంగా మారడంతో.. పూసపల్లి ఓసీ సైతం తవ్వకాలకు వీలుపడలేదు. భూములపై ఎలాంటి చట్టపరమైన హక్కులు లేని వారిని నిర్వాసితులుగా గుర్తించలేమంటూ సింగరేణి యాజమాన్యం కరాకండిగా తేల్చిచెప్పగా.. భూములు కోల్పోతున్న వారు సైతం పట్టుదలగా భీష్మించు కూర్చున్నారు. ఫలితంగా జేకే 5 ఓసీ విస్తరణ ప్రాజెక్టు పనులు ప్రారంభం కాలేదు. మూసివేతకు గురైన పాత జేకే 5 ఓసీలో సైతం కొద్ది నెలల క్రితమే బొగ్గు నిల్వలు పూర్తైనప్పటికీ.. కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీ చేయకుండా స్థానికంగా సర్దుబాటు చేయాలన్న ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు బొగ్గు ఉత్పత్తులు జరగనప్పటికీ కార్మికులకు ఉద్యోగులకు వేతనాలు చెల్లించింది. అయితే పూసపల్లి ఓసీ బొగ్గుగని తవ్వకాలు ప్రారంభం కాకపోవడంతో ఎంతకాలం జేకే 5ఓసీలో విధులు నిర్వహించకుండా వేతనాలు చెల్లించాలనే కారణాలతో కార్మికులను సింగరేణి యాజమాన్యం ఇతర ఏరియాలకు బదిలీ చేస్తూ.. శనివారం జేకే 5 ఓపెన్ కాస్టను మూసివేసింది.



మూతపడిన సింగరేణి జేకే5 ఓపెన్‌కాస్ట్ బొగ్గుగని



కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్

స్టోరేజీ బంకర్ మరమ్మతులకు..
సింగరేణి సమాయత్తం

- సీహెచ్‌పీలో 18 నెలల క్రితం పగుళ్లు
- రిపేర్లకు ఎన్ఐటీ సూచన.. త్వరలో టెండర్లు

6

48గంటల్లో సంచుల సరఫరా

జిల్లాలో ఎక్కడా కొరత లేదు : అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిపాదనలు పంపిన 48గంటల లోపు కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేస్తున్నామని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వానాకాలం ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని, జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామన్నారు. అయితే రైతుల ఇళ్లకు గన్నీ సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 9,71,500 సంచులు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో ఎక్కడా కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు
గన్నీబ్యాగులు

6

గోపాలదేవబోయిన పల్లికి చేరిన లారీ

ఖనిజాల రంగంలో
సహకారం అందించండి

- సింగరేణికి.. ఆఫ్రికా ఆహ్వానం
- సీఎండీని కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా బృందం

కొత్తగూడెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పడమటి ఆఫ్రికాలోని ఓ దేశమైన రిపబ్లిక్ ఆఫ్ ఘనా నుంచి సింగరేణి సంస్థకు ఆహ్వానం అందింది. ప్రపంచంలోనే వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం ఉత్పత్తులకు పేరొందిన దేశం ఘనాకు చెందిన బృందం శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ ఎన్. బలరాంను కలిసి పలు వ్యాపార అంశాలపై చర్చలు జరిపారు. తమ దేశంలో ఖనిజ రంగంలో పెట్టుబడులకు అవకాశం ఉందని, అక్కడ పెట్టుబడులు పెట్టాలని ఆ దేశ బృంద ప్రతినిధులు సీఎండీని కోరారు. అక్కడ పెద్దఎత్తున ఖనిజాల తవ్వకం, ఉత్పత్తులు జరుగుతుంటాయని, విదేశాలకు సైతం ఎగుమతి చేస్తుంటామని సీఎండీకి తెలిపారు. అయితే ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన పెట్టుబడుల పెట్టడం ఆహ్వానం పలుకుతున్నామని, ఈ అవకాశాన్ని సింగరేణి అందిపుచ్చుకోవాలని కోరారు. తమ దేశంలో బొగ్గు మైనింగ్ కూడా ఉందని, అందులో కూడా సింగరేణి సహకారం అందించాలని వారు కోరారు. కాగా దీనిపై సింగరేణి సీఎండీ బలరాం స్పందిస్తూ సింగరేణి వ్యాపార విస్తరణలో భాగంగా విదేశాల్లో ఇతర ఖనిజాలు, కీలక ఖనిజ రంగాల్లో ప్రవేశించాలని నిర్ణయించి ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ఘనా దేశంలో కూడా మైనింగ్ జరపడానికి అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కీలక ఖనిజ తవ్వకాలకు అవకాశం ఉంటే అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా మరో నెల రోజుల్లో ఘనా దేశానికి చెందిన సాంకేతిక బృందం కేంద్ర ప్రభుత్వంతో సమావేశం కానున్నట్టు, ఆ సమయంలో మరో దఫా భేటీ కావాలని, అలాగే తమ దేశానికి సింగరేణి బృందాన్ని పంపాలని ఘనా దేశ బృందం కోరింది. ఈ సమావేశంలో డైరెక్టర్(పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్(పర్సనల్) పోట్రు గౌతమ్, జీఎం(కో ఆర్డినేషన్) టి. శ్రీనివాస్, ఘనా దేశ ప్రతినిధి బృందంలో బిజినెస్ కన్సల్టెంట్ అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బేటు, ఘానాదేశ తరపున మాలి దేశ రాయబారి అహ్మద్ ఉమర్ సాండా, ఘనా దేశ అధ్యక్షుడు జాన్ సోదరులు ప్రముఖ వ్యాపారవేత్త మైకేల్ మహామ, స్టాండర్డ్స్ బోర్డు చైర్మన్ మోగ్తారి హుడు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్యాలయ సీనియర్ కరస్పాండెంట్ అగ్రే ఎలిషమా ఫ్రెడరిక్, నేషనల్ సెక్యూరిటీ విభాగం అధికారి అంగామ్బైన్ సైతాసలివు, బిజినెస్ హెడ్ పరుల్ కక్కర్, ప్రముఖ వ్యాపారవేత్త అగ్బెంకోర్ ఎడ్నా ఈడెం పాల్గొన్నారు.



ఘనా దేశ బృంద సభ్యులతో సింగరేణి సీఎండీ, అధికారులు

నగదు రూపంలో చెల్లింపులకు స్వస్తి

- పీఎంశ్రీ నిధుల వినియోగంపై మార్గదర్శకాల జారీ
- విక్రయదారులు, సప్లయర్ల ఖాతాలకే నేరుగా చెల్లింపు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధులు, వ్యయ లావాదేవీలు ఇకనుంచి నగదు రూపంలో చెల్లింపులు జరగకుండా నేరుగా అమ్మకందారులకే బ్యాంకు ద్వారా చెల్లింపులు జరగాలని సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక నుంచి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీఎం శ్రీ నిధులు నేరుగా ఖర్చు చేయడానికి వీలు లేకుండా పోతుంది. అన్ని లావాదేవీలు ట్రెజరీల ద్వారానే జరగాల్సి ఉంటుంది. ఈ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ విధానం వల్ల తమకు పెద్ద తలనొప్పిగా మారిందని కొందరు ప్రధానోపాధ్యాయులు అంటున్నారు.



ఇవీ మార్గదర్శకాలు

ఇకనుంచి అన్ని బిల్లులు ఎస్ఎన్ఏ-స్పార్ష్ ద్వారా ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ట్రెజరీకి సమర్పించాల్సి ఉంటుంది. కేంద్ర నిధుల విడుదల జస్ట్ ఇన్ టైం విధానం ప్రకారం జరగాలి. సీఎస్ఎస్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. అన్ని లావాదేవీలు జీఎఫ్ఆర్ 2017, ఎఫ్ఎంసీ మాన్యువల్ ప్రకారం సీఎస్ఎస్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. నిధులు కేవలం ఆమోదించిన పథకానికి మాత్రమే వినియోగించాలి. ఇతర ఖర్చులకు వాడకూడదు. సీఎస్ఎస్ నిధులను సాధారణ ఖర్చులకు దారి మళ్లించడం తప్పు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఫైనాన్స్ ఎకౌంట్స్, ఆఫీసర్ కూడా ఇతర సిబ్బందికి స్వీయ చెల్లింపులు చేయరాదు. చెల్లింపులు విక్రయదారులు, సప్లయర్ల ఖాతాలకు మాత్రమే జరగాలి. మంజూరైన నిధుల వివరాలను ప్రధానోపాధ్యాయులకు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి సమర్పించాలి. జిల్లా విద్యాశాఖ అధికారి బిల్లులను పరిశీలించి, ఫైనాన్స్ ఎకౌంట్స్ ఆఫీసర్‌కి మంజూరు తెలపాలి. ప్రతీ నెల ఖర్చులు, రిక్యాన్సిలేషన్ (ఖర్చుల సరి చూడడం) ట్రెజరీ వ్యయ వివరాలతో సరిపోల్చాలి. ఫైనాన్స్ ఎకౌంట్ ఆఫీసర్స్ (ఎఫ్ఏఓ)లు ముందుగానే ప్రధానోపాధ్యాయులకు నియమాలు, మార్గదర్శకాలు ఇవ్వాలి. డీడీఓ కోడ్ నిర్వహణ చేయాలి. జిల్లా విద్యాశాఖ అధికారి మంజూరు చేసిన తర్వాతే బిల్లులను ట్రెజరీకి సమర్పించాలి. ప్రతీ నెల స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కి ఖర్చుల వివరాలు సమర్పించాలి. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా కమిటీ సిఫార్సు ఆధారంగా బిల్లులు పరిశీలించాలి. బిల్లులు, జీఎస్టీ డాక్యుమెంట్లు, రశీదులు సేకరించి జిల్లా వద్యాశాఖ అధికారికి అందించాలి. ప్రతీ నెల ఖర్చుల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపాలి. డీడీఓ, ట్రెజరీ అధికారులు తప్పనిసరిగా అన్ని బిల్లులు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ ద్వారా ట్రెజరీకి పంపాలి. నిధులు ఆమోదిత ప్రణాళికలకే వినియోగించాలి. కొనుగోళ్లు జీఈఎం, జీఎఫ్ఆర్ నిబంధనల ప్రకారం చేయాలి. ఖర్చులు బడ్జెట్ పరిమితుల్లోనే జరగాలి. ప్రధానమైన అంశాల వ్యయ లావాదేవీలు, జస్ట్ఇన్ టైం పద్ధతిలో జరగాలి. నిధులను అనుమతి లేని ఖర్చులకు వాడకూడదు. బిల్లులు, రసీదులు, ఖర్చుల వివరాలు సరిగా అమర్చాలి. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.

ఓపెన్ తరగతుల తీరు పరిశీలన

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఓపెన్ స్కూల్ తరగతుల తీరును రాష్ట్ర ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జ్యోతి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ కూరపాటి మంగపతిరావులు శనివారం సందర్శించారు. ఏదులాపురం పాఠశాల ఖమ్మం రూరల్, చిరుమర్రి పాఠశాల ముదిగొండ మండలం, నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జరుగుతున్న తరగతులను పరిశీలించారు. ఆయా పాఠశాల రికార్డులను పరిశీలించి, అడ్మిషన్ల వెరిఫికేషన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. సిబ్బందిని వారు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దేశ ప్రజల కష్టార్జితం ఎల్ఐసీ

- ప్రపంచంలోనే నెంబర్ 1 బీమా సంస్థగా గుర్తింపు
- సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు
- ఖమ్మంలో ప్రారంభమైన సౌత్ జోన్ ఎల్ఐసీ ఏవోఐ ఆరవ మహాసభలు
- పాల్గొన్న తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రతినిధులు



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 1956కు ముందు దేశంలో 200కు పైగా ప్రైవేట్ కంపెనీలు ప్రజల సొమ్మును దోచుకుంటుంటే ఆ దోపిడీని నివారించి ప్రజల బీమా ప్రయోజనాలను కాపాడేందుకు 1956లో ఎల్ఐసీ సంస్థ ఏర్పాటు జరిగిందని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు అన్నారు. ఇప్పటికీ 99.5శాతం బీమా చెల్లింపులు చేస్తూ ప్రపంచంలోనే నెంబర్ 1 బీమా సంస్థగా నిలబడిందన్నారు. కానీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుయుక్తులతో ఇప్పుడు జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)ని నిర్వీర్యం చేస్తోందని.. అందువల్ల దాన్ని పరిరక్షించుకునేందుకు ఏజెంట్లు సైనికుల వలే ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ఎల్ఐసీ, ఏవోఐ సౌత్ సెంట్రల్ జోనల్ ఆరవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సభలను సంఘం జాతీయ అధ్యక్షులు సురజిత్‌కుమార్ బోస్ జెండావిష్కరణ చేసి ప్రారంభించారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. 1956లో ఎల్ఐసీ సంస్థ ప్రారంభం నాటి నుంచి సంస్థ పరిరక్షణకు, ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి ఎల్ఐసీ ఏజెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా విశేషంగా కృషి చేసిందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని ఇప్పటికీ ఎల్ఐసీ నిలుపుకుందంటే.. అది ఏజెంట్లు నిర్విరామంగా అందించిన సేవలు, సకాలంలో క్లెయిమ్‌ల చెల్లింపులే కారణమన్నారు. ప్రపంచంలో ఏ బీమా సంస్థ ఇవ్వని విధంగా 99శాతానికి పైగా బీమా చెల్లింపులు జరిగాయన్నారు. అయితే భారతదేశంలో నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాల అమలు పేరుతో ఎల్ఐసీని నిర్వీర్యం చేసే కుట్రలను ప్రభుత్వాలు చేశాయన్నారు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బ్యాంకులు, రైల్వేలు, బొగ్గు, రక్షణ, విద్యుత్ అనేక రంగాలతో పాటు ఎల్ఐసీని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు సవరణలు చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ దోపిడీకి గురైన ఇతర రంగాల కార్మికులను కలుపుకొని ఎల్ఐసీ ఏజెంట్లు ఉద్యమాలు చేసి తమ సంస్థను నిలుపుకోవాలని కోరారు. ఏవోఐ ఆల్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు సురజిత్‌కుమార్ బోస్, పీజీ దిలీప్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్ బీమా కంపెనీలను ప్రోత్సహిస్తోందన్నారు. ఎంత ప్రోత్సహించినా.. ఇంకా 30కోట్ల పాలసీదారులతో రూ.57లక్షల కోట్లు సొంత ఆస్తులను ఎల్ఐసీ కలిగి ఉందన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ ఏజెంట్లకు నష్టం కలిగించేలా కమీషన్ కుదింపు చేసిందన్నారు. ఏజెంట్ల వ్యవస్థను పరోక్షంగా కేంద్ర ప్రభుత్వమే నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, ప్రభుత్వంతో ఐఆర్‌డీఏ చేతులు కలిపి అనేక సంస్కరణల పేరుతో ఎల్ఐసీ యాజమాన్యంపై ఒత్తిడి పెంచుతుందన్నారు. భవిష్యత్‌లో ఏజెంట్లు అనేక పోరాటాలు చేసి సంస్థను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జోనల్ అధ్యక్షులు ఎల్ మంజునాథ్, ఆహ్వాన సంఘం చైర్మన్ డాక్టర్ భారవి, జోనల్ కార్యదర్శి పీఎల్ నర్సింహారావు, జోనల్ అధ్యక్షులు జీ తిరుపతయ్య, బాలాజీనాయక్, తాళ్లూరి శ్రీనివాస రావు, తన్నీరు కుమార్, పి. ప్రసాద్, నవీన్‌తో పాటు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 250మంది ప్రతినిధులు పాల్గొన్నారు.



కోయగూడెం ఓసీని పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్

రోజువారీ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలి

- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

టేకులపల్లి/ఇల్లెందు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) ఇల్లెందు సింగరేణి ఏరియా ల్లో వివిధ ఓసీ విభాగాల్లో బొగ్గు ఉత్పత్తి రోజువారీ లక్ష్యాన్ని మించి అధిగమించేందుకు కృషిచేయాలని సింగరేణి డైరెక్టర్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన ఇల్లెందు సింగరేణి ఏరియాలోని కోయగూడెం ఓసీలను పరిశీలించారు. ఓసీలో పనిస్థలాలను, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనుల వివరాలను జీఎం కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి రవాణాకు ఆటంకం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాకాలం ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ భాను ప్రసాద్, కేఓసీ మేనేజర్ శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి పాల్గొన్నారు.

సుక్మా జిల్లాలో ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

కొత్తగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. సుక్మా జిల్లా పరిధిలోని చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతా బలగాలు గస్తీకి వెళ్లిన సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా.. వారిని మావోయిస్టులుగా గుర్తించి ఐఈడీ అమర్చేందుకు వెళ్తున్న సమయంలో అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో డీఏకేఎంఎస్ అధ్యక్షుడు పదం హిడ్మా, మిలిషియా కమాండర్ తాటి హిడ్మా ఉన్నట్టు తెలిసింది.

కమ్యూనిస్టులకు ప్రాణత్యాగాలు కొత్తకాదు..

- ఉద్యమాలను దెబ్బతీసేందుకే సామినేని హత్య
- హంతకులను పట్టుకుని భట్టి తన బాధ్యతను రుజువు చేసుకోవాలి
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

చింతకాని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని దెబ్బతీసేందుకే సామినేని రామారావును కాంగ్రెస్ పెద్ద నాయకుల అండతో ఆ పార్టీ గూండాలు అత్యంత కిరాతకంగా హత్య చేశారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. శనివారం మండలం లోని పాతర్లపాడు గ్రామంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు సంస్మరణ సభ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన రామారావు అభిమానులు, గ్రామస్థులు, సీపీఎం కార్యకర్తలు తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రసంగించారు. సామినేని రామారావు హత్యను ప్రపంచ కమ్యూనిస్టు దేశాలు ఖండించాయన్నారు. రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా రామారావు అనేక రైతాంగ ఉద్యమాల్లో పని చేశారన్నారు. శత్రువులని కూడా ప్రేమతో పలకరించేవారన్నారు. అత్యంత కిరాతకంగా రామారావును చంపిన హంతకులను కనిపెట్టలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. అత్యంత అధునాతన సాంకేతికత ఉన్న హత్య జరిగి 10 రోజులు గడిచినా.. పోలీసులు హంతకులను పట్టుకోకపోవడం వారి పనితనానికి నిదర్శనమన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హత్య రాజకీయాలపై నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. త్వరతగతిన హంతకులను పట్టుకునేలా పోలీసులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి అసలు హంతకులను పట్టుకుని తన నిర్ధోషితత్వాన్ని కాంగ్రెస్ రుజువు చేసుకోవాలన్నారు. ప్రాణత్యాగాలు కమ్యూనిస్టులకు కొత్త కాదని, అనేక ప్రజా ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయామని, పేద ప్రజల కోసం పోరాడిన కామ్రేడ్ రామారావు అమరుడయ్యారన్నారు. రామారావును హత్య చేసి భయాందోళనలకు గురిచేసినంత మాత్రాన కమ్యూనిస్టు ఉద్యమం ఆగిపోదన్నారు.



నివాళులర్పిస్తున్న తమ్మినేని, ఇతర నేతలు

దండం పెట్టడం కాదు.. దండించడమూ తెలుసు

- తమ్మినేని వీరభద్రం

అవసరమైనపుడు దండం పెడతామని, తమపై తిరగబడితే దండించే తత్వం కూడా కమ్యూనిస్టులకు తెలుసునని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రశ్నించే నాయకులను లేకుండా చేసి ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూని చేయాలని చూస్తుందన్నారు. పరిపాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకదానికొకటి తీసిపోదన్నారు. అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే నాయకులు ఉద్భవిస్తూనే ఉంటారన్నారు. రామారావు ఆశయాలను సాధించేందుకు అందరూ కృషి చేయాలని వచ్చే స్థానిక ఎన్నికలలో ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు.

ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్, భాగం హేమంతరావు, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వరరావు, పీ సోమయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతల చెర్వు కోటేశ్వరరావు, రాచబంటి రాము తదితరులు పాల్గొన్నారు.

మా అబ్బాయికి లాటరీ రావడం సంతోషంగా ఉంది

రూ.240కోట్ల విజేత అనిల్ తల్లిదండ్రులు



బొల్లా మాధవరావు, మాధవరావు

వేంసూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూఏఈలో లాటరీలో తమ కుమారుడికి రూ.240కోట్లు రావటం చాలా ఆనందంగా ఉందని బొల్లా అనిల్‌కుమార్ తల్లిదండ్రులు మాధవరావు, భూలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. శనివారం వేంసూరు మండలం భీమవరం గ్రామంలో ఉన్న వారిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమది సాధారణ రైతు కుటుంబమని, ఐదెకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు బాలసుబ్రహ్మణ్యం కూడా గతంలో ఉద్యోగం చేశాడని, ప్రస్తుతం స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాడని, చిన్నకుమార్ అనిల్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడని వివరించారు. అబుదాబీలో పని చేస్తున్న తమ కుమారుడు యూఏఈలో తాను కొన్న లాటరీ టిక్కెట్లలో ఒక నెంబరుకు లాటరీలో రూ.240కోట్లు వచ్చినట్టు తమకు ఫోన్‌చేసి చెప్పాడన్నారు. పెద్ద మొత్తంలో లాటరీలో రావటం ఆనందంగా ఉందన్నారు. కొద్ది రోజులు హైదరాబాద్‌లో ఉండి తాము కూడా స్వగ్రామానికి తిరిగి వచ్చామని చెప్పారు. అయితే 'మీరు కూడా అబూదాబీ వెళతారా?' అని ప్రశ్నించగా తమ కుమారుడు ఎలా చెబితే అలా చేస్తామన్నారు.

రూ.లక్షల వ్యయంతో కార్యాలయం ఏర్పాటు.. ప్రాంభించకుండానే వదిలివేశారు



నిరుపయోగంగా ఉన్న వ్యవసాయశాఖ నూతన కార్యాలయం

కారేపల్లి నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండల వ్యవసాయశాఖకు సొంత కార్యాలయం లేకపోవడంతో స్పందించిన దాత లక్షల విలువచేసే భూమిని కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఈ స్థలంలో రూ.12 లక్షల వ్యయంతో అధికారులు పది సంవత్సరాల క్రితం మండల ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరలో భవనం నిర్మించారు. అయితే ఆ భవనంలో కార్యాలయం ఏర్పాటు చేయకుండా అప్పటి వ్యవసాయశాఖ అధికారులు నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ఇప్పటికీ ఆ కార్యాలయం ఖాళీగానే ఉంటుంది. కానీ ప్రస్తుతం వ్యవసాయశాఖకు సరైనా కార్యాలయం లేకపోవడంతో కొంతకాలం మండల పరిషత్ కార్యాలయంపై ఏర్పాటుచేశారు. ఈజీఎస్ కార్యాలయం ఏర్పాటుకు ఇబ్బందిగా ఉందని వ్యవసాయశాఖ అధికారులను ఖాళీచేయాలని అప్పటి ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశాలతో ఇక్కడనుంచి ఐకేపీ కార్యాలయం వద్దకు మార్చారు. అక్కడకూడా సరైన సౌకర్యాలు లేకపోవడంతో.. అసలు వ్యవసాయశాఖ కార్యాలయం ఎక్కడుంది అని అడిగితే సరైన సమాధానం కూడా చెప్పలేని పరిస్థితిలో అధికారులు, ప్రజలు, రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడో మారుమూలన కార్యాలయం ఏర్పాటుచేశారని, అక్కడ సిబ్బంది ఉన్నది, లేనిదీ తెలియడంలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థలదాత తాతా శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సొంత కార్యాలయం లేదంటే తానే రూ.లక్షల విలువచేసే స్థలాన్ని ఉచితంగా అందచేశానని, స్థలంలో భవనం నిర్మించినా అందులో కార్యాలయం ఏర్పాటు చేయనప్పుడు తన స్థలం తనకు ఇవ్వాలని కోరుతున్నాడు. కానీ ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే వ్యవసాయశాఖ కార్యాలయం ఏర్పాటు చేయలని రైతులు కోరుతున్నారు.

స్టోరేజీ బంకర్ మరమ్మతులకు.. సింగరేణి సమాయత్తం

- సీహెచ్‌పీలో 18 నెలల క్రితం పగుళ్లు
- రిపేర్లకు ఎన్ఐటీ సూచన..
- త్వరలో టెండర్లు

సత్తుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో నిర్మించిన కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)లో స్టోరేజీ బంకర్ల మరమ్మతులకు సింగరేణి సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించిన సీహెచ్‌పీలో 18 నెలల క్రితం ఒక బంకర్‌కు పగుళ్లు వచ్చాయి. పగుళ్ల కారణంగా సదరు బంకర్‌లో గత ఏడాది జులైలో బొగ్గు లోడింగ్ నిలిపివేశారు. మొత్తం మూడు స్టోరేజీ బంకర్లలో ఒకటి శిథిలం కావడంతో.. దాన్ని మరమ్మతు చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

సీహెచ్‌పీ పూర్వపరాలు

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూ.400కోట్ల వ్యయంతో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్మాణాన్ని 2019లో చేపట్టారు. అప్పట్లో కోవిడ్ కారణంగా పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఆ తర్వాత దీన్ని పూర్తి చేసి అదే సమయంలో రైల్వే లైను కూడా అందుబాటులోకి రావటంతో ఏకకాలంలో ప్రారంభించారు. సత్తుపల్లి మండలంలో 141 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా లక్ష్యంగా అధికారులు శ్రమిస్తున్నారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణాను కేంద్ర పర్యావరణ శాఖ వ్యతిరేకించడంతో.. పర్యావరణం కలుషితం కాకుండా సీహెచ్‌పీ నిర్మించి అక్కడి నుంచి రైల్వే మార్గంలో బొగ్గు రవాణా చేయాలనే లక్ష్యంతో సీహెచ్‌పీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఓపెన్‌కాస్టుల్లోని బొగ్గును తొలుత బంకర్ల ద్వారా కోల్ రిసీవింగ్ ప్లాంట్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం కన్వేయర్ బెల్టుపై బొగ్గును కిష్టారం సమీపంలో నిర్మించిన మూడు జైలో బంకర్లకు తరలిస్తారు. మూడు స్టోరేజీ బంకర్ల సామర్థ్యం 24వేల టన్నులు. వీటిలో ఒకటి శిథిలం కావడంతో.. బొగ్గు రెండు స్టోరేజీ బంకర్ల నుంచి రవాణా జరుగుతోంది.

పగుళ్లపై అధ్యయనం

రూ.వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన సీహెచ్‌పీలో స్టోరేజీ బంకరుకు పగుళ్లు రావటంతో ఇలా ఎందుకు జరిగింది!? దీని ఎలా మరమ్మతులు చేయాలనే అంశంపై సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు ప్రముఖ సంస్థలకు చెందిన నిపుణులతో అధ్యయనం చేయించారు. వరంగల్ నిట్ ఇంజనీరింగ్ నిపుణుల అధ్యయనం అనంతరం వారి సూచనల మేరకు బంకరు పునర్నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు సంస్థ మరో నెల రోజుల్లో టెండర్లు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రస్తుతం ఎనిమిది ర్యాకుల బొగ్గు రవాణా

ఒక బంకర్ పగుళ్లు ఇవ్వడంతో.. ప్రస్తుతం ఎనిమిది ర్యాకుల ద్వారా 32వేల టన్నుల బొగ్గు రవాణా జరుగుతోంది. మరో ఆరు వేల టన్నుల బొగ్గు రోడ్డు మార్గంలో రవాణా చేస్తున్నారు. మూడు స్టోరేజీ బంకర్లు పని చేస్తే రోజుకు 12 ర్యాకుల బొగ్గు రైల్వే మార్గంలో రవాణా జరిగే అవకాశం ఉంది.

ధాన్యం కేంద్రాలకు గన్ని సంచులు సరఫరా



గన్ని సంచుల లోడింగ్‌తో గోపాల దేవబోయినపల్లి గ్రామానికి చేరిన లారీ

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని ధాన్యం కేంద్రాల్లో గన్ని సంచుల కొరతతో కాంటాలు నిలిచిపోవడంతో కొనుగోలులో జాప్యం జరిగింది. దీంతో ఈ ప్రాంతానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం కల్లూరు పీఏసీఎస్ పరిధిలోని గోపాల దేవబోయినపల్లి గ్రామంలో కూడా గన్ని సంచులు అందక కాంటాలు నిలిచిపోయాయి. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గోపాల దేవబోయిపల్లి, లింగాల, ఎర్రబోయినపల్లి, చంద్రుపట్ల తదితర గ్రామాల్లో వేల బస్తాల ధాన్యం అరబెట్టి తేమ శాతం తగ్గటంతో పలువురు రైతులు ధాన్యంను అమ్మేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడ్డారు. జిల్లా పౌరసఫరాల శాఖ తరుపున కల్లూరు, చెన్నూరు సొసైటీలకు అరకొరగా గన్ని సంచులు అందించడంతో పలు గ్రామాల్లోని ధాన్యం కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై శనివారం ఆంధ్రజ్యోతిలో 'గన్ని సంచులుల్లేక..' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు కల్లూరు సొసైటీ పరిధిలో గల గోపాల దేవబోయినపల్లి కేంద్రానికి 15 వేల గన్ని సంచులు, చంద్రుపట్ల ధాన్యం కేంద్రానికి మరో 10 వేల గన్ని సంచులు అందినాయి. శనివారం సా యంత్రం ఆయా కేంద్రాలకు జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు ప్రత్యేకంగా రెండు లారీల్లో గన్ని సంచులు పంపగా కొనుగోలు కేంద్రాల పరిధిలో గల రైతులకు ఉపశమనం కలిగింది. వాస్తవంగా కల్లూరు మండలంలో సుమారు 33వేలకు పైగా ఎకరాల్లో వరిసాగు అయింది. ఈ ప్రాంతంలో ముందస్తుగా వరిసాగు చేయటంతో జిల్లాలని ఇతర మండలాల కంటే వరి పంట నెలరోజుల ముందుగానే దిగుబడికి రావటం జరిగింది. దీంతో పలు గ్రామాలకు చెందిన రైతులు చేతికి వచ్చిన పంటను అమ్ముకునేందుకు ముందుకు వచ్చారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల డిమాండుకు తగినట్లుగా సకాలంలో జిల్లా అధికార యంత్రాంగం గన్ని సంచులను సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. గన్ని సంచులను అందిస్తే కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ చురుకుగా సాగే అవకాశం ఉంది.

అక్కడి ఎన్నికకు..ఇక్కడి నేతలు

(5వ పేజీ తరువాయి)


డివిజన్ల వారీగా బాధ్యతలు చూసుకంటూ నవీన్‌యాదవ్ విజయం కోసం శ్రమిస్తున్నారు. ఇక కాంగ్రెస్‌కు మద్దతుగా మిత్రపక్షం సీపీఐ ప్రచారం చేస్తుండగా..ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు పలువురు నేతలు అక్కడే మకాం వేశారు.

ప్రచారంలో గులాబీదళం..

బీఆర్ఎస్ అభ్యర్థి, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ భార్య సునిత గెలుపుకోసం జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడఅజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో నిమగ్నమయ్యారు. వారితో పాటు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు హైదరాబాదులోనే ఉండి తమ నేతలతో పాటు డివిజన్లలో తిరుగుతున్నారు. మొత్తంమీద జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్‌కు చెందిన ఉమ్మడి జిల్లా నేతలంతా హైదరాబాదులో మకాం వేసి తమ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం శ్రమిస్తున్నారు. ఈఎన్నిక జూబ్లీహిల్స్‌కు అయినప్పటికీ ఫలితం ప్రభావం రాష్ట్రరాజకీయాలపై ఉండబోతున్న నేపథ్యంలో.. ఈ ఎన్నికను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ గెలుపుతో రాష్ట్రంలో ప్రభుత్వ ప్రతిష్ట తగ్గలేదని ప్రజలు కాంగ్రెస్‌వైపే ఉన్నారని చెప్పుకునేందుకు కాంగ్రెస్ ఆరాటపడుతోంది. తాము గెలిస్తే కేడర్‌లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని, రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా బలం చెక్కుచెదరలేదన్న విషయం ప్రజల్లోకి వెళతుందని బీఆర్ఎస్ భావిస్తోంది.

గోదావరిలో దూకేందుకు మహిళ యత్నం

- భద్రాద్రి వారధిపై నుంచి దూకుతుండగా అడ్డుకున్న స్థానికులు
- పోలీసులే కారణమంటూ బైఠాయింపు
- కుటుంబకలహాల నేపథ్యంలో డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణలు



వారధిపై నుంచి దూకేందుకు ప్రయత్నించిన మహిళ

భద్రాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ భద్రాచలం వారధిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆమె పోలీసులపై ఆరోపణలు చేయడం తీవ్ర కలకలం రేపింది. అయితే ఆ మహిళ గోదావరిలో దూకేందుకు యత్నించగా అటుగా వెళుతున్న వారు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలవీ.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్త కాలనీకి చెందిన స్వాతి అనే మహిళ కుటుంబకలహాల క్రమంలో న్యాయం చేయాలంటూ శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదును పోలీసులు స్వీకరించిన క్రమంలో ఇద్దరు కానిస్టేబుళ్లు తనను డబ్బులు డిమాండ్ చేశారని, తన పుట్టింటి వారిని దూషించారని ఆమె ఆరోపిస్తోంది. దాంతో మనస్తాపానికి గురైన తాను గోదావరి వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని పేర్కొంది. అయితే స్థానికులు ఆమెను అడ్డుకుని పోలీసులకు సమాచారమిచ్చిన సమయంలో వారధిపై బైఠాయించిన స్వాతి తనకు న్యాయం చేయాలని, పోలీసులపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపింది. స్థానికులు, పోలీసులు నచ్చచెప్పి అక్కడ నుంచి పంపారు. అయితే ఈ విషయంపై భద్రాచలం సీఐ నాగరాజును వివరణ కోరగా ఆ మహిళ ఇప్పటికే 43సార్లు డయల్ 100కు ఫోన్ చేసిందని, పోలీసులను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. తరుచూ గోదావరి వారధిపైకి వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నం చేస్తున్నానని ఫోన్ చేస్తోందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇప్పటికే కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ వేశామని తెలిపారు. ఈ క్రమంలో ఆమెను ఎవరూ డబ్బులుడిమాండ్ చేయలేదని, ఆమెను కానీ, ఆమె కుటుంబీకులను కానీ దూషించలేదని ఆయన స్పష్టం చేశారు.

ఇదిగో.. అల్లుళ్ల రాజ్యం!

- వారి అడ్డాగా మారిన మోడల్ కాలనీ
- పేరాయిగూడెం అమ్మాయిలను వివాహమాడిన వారంతా ఇక్కడే నివాసం
- కూలీలు, డ్రైవర్లు, చేతివృత్తులు వారే అధికం



అల్లుళ్ల కాలనీ వ్యూ

అశ్వారావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోడల్ కాలనీ.. అదే అల్లుళ్ల కాలనీ.. అశ్వారావుపేట మునిసిపాలిటీ పరిధిలో పేరాయిగూడేన్ని ఆనుకొని వున్న ఈ కాలనీలో దాదాపు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. 2002లో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నపుడు ఇక్కడ పేదలకోసం ఇళ్ల స్థలాలను కేటాయించారు. 2007 సమయంలో ఎమ్మెల్యే జలగం వెంకటరావు సమయంలో కేటాయించిన స్థలంలో కొందరికి పక్కా ఇళ్లను మంజూరు చేశారు. ఆ సమయంలో ఈ కాలనీకి మోడల్ కాలనీగా నామకరణం చేశారు. మొదట్లో పది పదిహేను ఇళ్లు మాత్రమే ఉండేవి. దశలవారీగా దాదాపు 150 కుటుంబాలు ఇక్కడకు చేరాయి. ఇక్కడ విశేషమేమిటంటే పేరాయిగూడెంగా పిలిచే దళితులు నివసించే గ్రామానికి చెందిన అమ్మాయిలను చుట్టుపక్కల పలు గ్రామాలకు చెందిన అబ్బాయిలు వివాహం చేసుకున్నారు. అప్పట్లో ఆయా ప్రాంతాలలో జీవనం సాగించటానికి సరైన సదుపాయాలు లేక పోవడంతో అప్పటికే పట్టణంగా ఉన్న అశ్వారావుపేటకు వస్తే ఏదో పనిచేసుకొని బతకొచ్చుననే ఉద్దేశంతో చాలా మంది అల్లుళ్లు వాళ్ల అత్తింటివారి సహకారంతో పేరాయిగూడెంకు వలస వచ్చారు. అలా వచ్చిన వారు పేరాయిగూడేన్ని ఆనుకొని ఉన్న మోడల్ కాలనీలో స్థిర నివాసమేర్పరచుకున్నారు. అలా ఈ కాలనీలో ఉన్న దాదాపు 150 కుటుంబాల్లో 100కుటుంబాలకు పైగా పేరాయిగూడెం వాసుల అల్లుళ్ల కుటుంబాలే ఉండటం విశేషం. మిగతా 50 కుటుంబాల్లోనూ ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవే అధికంగా ఉన్నాయి.

అన్నీ చిన్న చిన్న కుటుంబాలే..

మోడల్ కాలనీలో స్థిరపడిన అల్లుళ్ల కుటుంబాలన్నీ చిన్నవే. వ్యవసాయ కూలీలు, కరంటు పని, పెయింటర్లు, ట్రాక్టర్లు, ఆటోలు, డ్రైవర్లు, రోజువారీ కూలీలు, తాపీ పని వారు, వివిధ రకాల చేతి వృత్తుల వారు, వీధుల్లో తిరుగుతూ చేసే చిన్న చిన్న సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగించేవారే అధికంగా ఉన్నారు. కొందరేమో అత్తేరు ఇచ్చిన అరెకరం, ఎకరం పొలం కౌలుకు ఇచ్చుకొని ఏదో పనిచేసుకుంటూ జీవిస్తున్నారు.

గ్రామాన్ని తీర్చిదిద్దుకోవడంలోనూ దిట్టే..

ఇక్కడ అందరూ బయటి ప్రాంతాలనుంచి వచ్చిన అల్లుళ్లే అయినా అందరూ కలసికట్టుగా ఉండి గ్రామాన్ని తీర్చిదిద్దుకున్నారు. వాటర్ ట్యాంకు, అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యేను కలసి సీసీ రహదారుల కోసం రూ.50లక్షల మంజూరు చేయించుకున్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేయించుకున్నారు. ఇక కొందరు గ్రామంలో చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.

23ఏళ్ల క్రితం కాలనీ ఏర్పడింది

- తగరం జగన్నాథనం, పేరాయిగూడెం మాజీ ఉప సర్పంచ్



2002 ప్రాంతంలో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమయంలో మోడల్ కాలనీకి స్థలాన్ని కేటాయించారు. 2007లో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. అయితే ఈ కాలనీలో దాదాపు 100 కుటుంబాలకు పైగా పేరాయిగూడేనికి చెందిన అమ్మాయిలను వివాహం చేసుకొని ఇక్కడ జీవించటానికి వలస వచ్చిన అల్లుళ్లే ఉన్నారు. దీంతో ఈ గ్రామాన్ని అల్లుళ్ల కాలనీగా పిలుచుకుంటాం.

ఎలక్ట్రికల్ పనిచేసుకొని జీవిస్తున్నాం..



"నాది కుకునూరు మండలం దామెరచర్ల గ్రామం. పేరాయిగూడెం అమ్మాయిని వివాహం చేసుకొని 15 ఏళ్ల క్రితం ఇక్కడకు వచ్చి స్థిరపడ్డా. ఎలక్ట్రికల్ పని చేసుకొని జీవిస్తున్నా."

- కవులూరి బలరామ్

కూలీ పనులకు వెళ్తున్నా..



"మాది ఏపీలోని కామయ్యపాలేం. పేరాయిగూడెం అమ్మాయిని 25 ఏళ్ల క్రితం వివాహం చేసుకొని ఇక్కడే స్థిరపడ్డా. పనులు చూసుకుంటూ అత్తగారి ఊరి సమీపంలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటాను. ఇల్లు కూడానిర్మించుకున్నా."

- గాలంకి వెంకటేశ్వరరావు

తాపీ పనులు చేసుకుంటున్నా...



"నాది దమ్మపేట మండలం మల్కారం గ్రామం. పేరాయిగూడెం అమ్మాయిని వివాహం చేసుకున్నా. అప్పట్లో అక్కడ పెద్దగా పనిలేకపోవడంతో ఇక్కడకు వచ్చి తాపీ పనులకు వెళ్తున్నా. కుటుంబాన్ని పోషించుకుంటున్నా."

- రాయల పోలయ్య

కివ్వాక నుంచి వచ్చా..



"నాది కుకునూరు మండలం కివ్వాక గ్రామం. పేరాయిగూడెం అమ్మాయిని చేసుకున్నాను. ఇక్కడే ఏదో పని చేసుకోవచ్చుననే ఆలోచనతో ఇక్కడకి వచ్చేసా. కూలీ పని చేసుకుంటూ ఇక్కడే స్థిరపడ్డా."

- జుట్టు వెంకటేశ్వర్లు

మా గ్రామ అమ్మాయిలు మా దగ్గర్లోనే..



"మా గ్రామానికి చెందిన అమ్మాయిలను వివిధ ప్రాంతాల వారికిచ్చి వివాహం చేసినా.. వారిలో చాలామంది మా ఊరి పక్కనే మోడల్‌కాలనీలో స్థిరపడడం సంతోషంగా ఉంది. అందుకే ఈ కాలనీకి అల్లుళ్ల కాలనీగా పేరొచ్చింది."

- తగరం ఏసు, గ్రామపెద్ద

అట్టహాసంగా..

ప్రారంభమైన పాఠశాలల క్రీడా సమాఖ్య 69వ రాష్ట్ర స్థాయి క్రీడలు
ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే పాయం, భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ
గౌరవ వందనం సమర్పించిన క్రీడాకారులు



మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై ఎమ్మెల్యే పాయం, ఎస్పీ రోహిత్‌రాజు, డీఈవో నాగలక్ష్మి, జిల్లా యువజన క్రీడాధికారి పరంధామరెడ్డి, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

పినపాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్రస్థాయి 69వ క్రీడాపోటీలు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్లబయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో తలపడేందుకు తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 10 బాలికల జట్లు, 10 బాలుర జట్లు వచ్చాయి. కంది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు టిఫిన్, భోజనం, క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన జట్లకు జెర్సీలు వితరణగా అందించారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, డీఈవో, జడ్పీ సీఈవో నాగలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించి, ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఎంతోమంది వెలుగులోకి రాకుండా ఉండిపోతున్నారన్నారు. ఇలాంటి క్రీడలను చూశాక గ్రామీణ క్రీడాకారులు మరింత ముందుకొచ్చే అవకాశముందన్నారు. గ్రామీణ క్రీడగా పేరొందిన కబడ్డీ ఆడటం వల్ల శారీరక ఫిట్‌నెస్ వస్తుందన్నారు. ప్రతిభ ఉంటే అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి క్రీడలు మన జిల్లాలో జరగడమే కాకుండా తన సొంత నియోజకవర్గంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంతో మంది క్రీడాకారులను అందించిన ఘనత ఈ నియోజకవర్గానికి ఉందన్నారు. ఇక్కడ రాణించి, జాతీయ స్థాయి క్రీడల్లో కూడా సత్తాచాటి, మన జిల్లాతో పాటు రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ.. అందరికీ ఒకే రకమైన టాలెంట్ ఉండదని, ఒక్కొక్కరు ఒక్కో రంగంలో ప్రతిభ కలిగి ఉంటారన్నారు. తాము ఎంచుకున్న రంగంలో రాణించి, ఉన్నతస్థాయికి చేరుకునేందుకు కష్టపడాలన్నారు. తల్లిదండ్రులతో పాటు గ్రామానికి, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని.. వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ఎదగాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి, జడ్పీ సిఈఓ నాగలక్ష్మీ మాట్లాడు తూ.. క్రీడలు ఆరోగ్యానికి దోహదం చేస్తాయని, మానసిక స్థైర్యాన్నిస్తాయన్నారు. ఆ తర్వాత క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి పరంధామరెడ్డి, బీటీపీఎస్ సీఈ బి బిచ్చన్న, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, కంది చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంది సుబ్బారెడ్డి, క్రీడల ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ బి.వీరన్న, ఆర్గనైజర్ గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీడీవో పోటు సంకీర్త్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఎంఈవో నాగయ్య, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సురేష్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కంది తిరుపతిరెడ్డి, పీడీలు పి అనిల్, రాములమ్మ, ఆయా టీమ్‌ల కోచ్‌లు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


విజయం సాధించిన ఉమ్మడి ఖమ్మం బాలికల జట్టు

తొలిరోజు సత్తా చాటిన ఉమ్మడి ఖమ్మం జట్లు

పాఠశాలల క్రీడా సమాఖ్య 69వ అండర్-17 రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు తొలిరోజు హోరాహోరీగా సాగాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని క్రీడాకారులు ఉమ్మడి జిల్లాలుగా పాల్గొన్న ఈ టోర్నీలో తొలిరోజు ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలబాలికల జట్లు సత్తా చాటాయి. కబడ్డీలో వరంగల్- నల్గొండ బాలురు జట్లలో వరంగల్ విజయం సాధించింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో ఖమ్మం- కరీంనగర్ బాలురు జట్లు తలపడగా ఖమ్మం బాలురు జట్టు విజయం సాధించింది. బాలికల జట్లలో హైదరాబాద్-ఖమ్మం మధ్య సాగిన కబడ్డీ పోరులో ఏకపక్షంగా సాగింది. ఖమ్మం బాలికల జట్టు విజయదుందుభి మోగించింది. అనంతరం జరిగిన వరంగల్-నల్గొండ జట్ల మధ్య సాగిన ఆటలో నల్గొండ, వరంగల్-నిజామాబాద్ జట్ల మధ్య సాగిన పోరులో వరంగల్ జట్టు విజయం సాధించాయి.

ప్రజల సంక్షేమం కోసం పనిచేసే రేవంత్‌రెడ్డి

తుమ్మల క్యాంపు కార్యాలయంలో రేవంత్ జన్మదినోత్సవం
కేక్ కట్ చేసిన తుమ్మల యుగంధర్, ఏఎంసీ ఛైర్మన్ యరగర్ల


కేక్ కట్ చేస్తున్న తుమ్మల యుగంధర్, ఏఎంసీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు పనిచేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారని కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని రాష్ట్ర మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, నగర కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరితో కలిసి తుమ్మల యుగంధర్ సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటానికి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఎన్నో కేసుల్ని ఎదుర్కొన్నారని, కుటుంబ సభ్యులకు దూరమైన రోజులు ఉన్నాయన్నారు. కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, నాయకులు కొత్తా సీతారాములు, వాంకుడోత్ దీప్లానాయక్, మిక్కిలినేని నరేంద్ర, మందడపు మనోహర్, పుల్లారావు, నాళం సతీష్, ధనాల రమణ, బొమ్మ ఉదయ్, కుక్కల మహేష్, ఊరుకొండ చంద్రిక, మంగ పాల్గొన్నారు.

తప్పుడు కాంటాలతో మోసగిస్తున్న ఇరువురిపై కేసు నమోదు

ఏన్కూరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కాటాలతో రైతులను మోసగిస్తున్న ఇద్దరిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ సంధ్య తెలిపారు. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుడగా నూకాలంపాడు గ్రామానికి చెందిన వ్యక్తులు తప్పుడు వేయింగ్ మిషన్లతో మోసగిస్తున్న ఇద్దరిని అదుపులోకితీసుకున్నారు. ఇరువురిపై చీటింగ్ కేసునమోదుచేశారు. వేయింగ్‌మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. రైతులను మోసగించే వారిపై కఠినచర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామాల్లో తిరిగి కొనగోలు చేసేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్



ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

వేంసూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు భీమవరం మీదుగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు వెళ్తుండగా రోడ్డుదాటే సమయంలో సత్తుపల్లి నుంచి నూజివీడు వెళ్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ సంఘటన వేంసూరు మండలం మర్లపాడు ప్రధాన సెంటర్లో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సును టిప్పర్ బలంగా ఢీకొడితే పెనుప్రమాదం చోటు చేసుకొనేదని స్థానికులు ఆందోళన చెందారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు మెరవాలి

భద్రాద్రి జోన్ అధికారి విద్యారాణి
మండలంలో అట్టహాసంగా ముగిసిన గురుకుల జోనల్ క్రీడలు


మరిపెడలో జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు మెమోంటో అందిస్తున్న భద్రాద్రి జోన్ అధికారి విద్యారాణి

మరిపెడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో సైతం మెరవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ భద్రాద్రి జోన్ అధికారి విద్యారాణి అన్నారు. మరిపెడ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో శనివారం భద్రాద్రి జోన్ 11వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ముగింపు సమావేశానికి హాజరై విజేతలకు మెమెంటోలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. స్పోర్ట్స్ కోటలో ఉన్నత విద్యకు అవకాశం లభిస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపు.. ఓటములను సమానంగా స్వీకరించి రేపటి గెలుపు కోసం మెళకువలు నేర్చుకోవాలన్నారు. విజేతలకు ఆమె మెమెంటోను అందించి అభినందించారు. హోరాహోరీగా ఫైనల్ క్రీడా పోటీలు రసవత్తరంగా జరిగాయి. అండర్-14 ఓవరాల్ ఛాంపియన్‌గా మరిపెడ, అండర్-17, అండర్19 ఓవరాల్ ఛాంపియన్‌గా పాల్వంచ గురుకుల విద్యార్థులు నిలిచారు. ఈ కార్యక్రమంలో మరిపెడ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దయాకర్, ఫిజికల్ డైరెక్టర్ రవి, పీఈటీ రవి, ఆధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.

ముగిసిన గురుకుల క్రీడలు

ఓవరాల్ విజేతలుగా నిలిచిన ఇల్లెందు, వైరా


విజేతలతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

వైరా, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన భద్రాద్రి 11వ జోనల్ క్రీడల్లో ఓవరాల్ విజేతలుగా వైరా, ఇల్లెందు గురుకులాల విద్యార్థులు నిలిచారు. ఓవరాల్ స్పోర్ట్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా అండర్-14 విభాగంలో వైరా అదేవిధంగా అండర్-17, అండర్-19ల విభాగాల్లో ఇల్లెందు విద్యార్థులు విజయం సాధించారు. శనివారం ఈ క్రీడలు ప్రశాంతంగా ముగిశాయి. ఖమ్మంజిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మల్టీజోనల్ ఆఫీసర్ ఎం.అలివేలు, జోనల్ ఆఫీసర్ విద్యారాణి, వైరా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత, జిల్లా కన్వీనర్ కె.రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్-14 ఖోఖో విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలను ఎర్రుపాలెం, అడవిమల్లెల గెలుచుకున్నాయి. కబడ్డీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ములకలపల్లి, ధాన్యాయిగూడెం, టెన్నీకాయిట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో దాన్యాయిగూడెం, వైరా, అలాగే బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మధిర, వైరా గెలుచుకున్నాయి. షాట్‌పుట్‌లో డి.భార్గవి(అడవిమల్లెల), ఎస్.భార్గవి(వైరా), వి.మేధావర్షిత (కూసుమంచి) గెలుపొందారు.

అండర్-17విభాగంలో...

ఇండివిడ్యుయల్ చాంపియన్ అండర్-17విభాగంలో టీ.రేష్మ(వైరా), డిస్కస్‌త్రోలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎన్.వెన్నెల (భద్రాచలం), వి.తపస్వి(నేలకొండపల్లి), టి.రేష్మ(వైరా)గెల్చుకున్నారు.

షాట్‌పుట్‌లో.. టి.ఉమారాణి(అడవిమల్లెల), డి.శ్వేత(కూసుమంచి), కె.సంజన(ఎర్రుపాలెం), డి.శోభ(అడవిమల్లెల), ఎం.నిషిత(పాల్వంచ), డి.పావని(దాన్యాయిగూడెం) గెల్చుకున్నారు.

అండర్-19 వాలీబాల్‌లో : ప్రథమ, ద్వితీయ స్థానాల్లో పాల్వంచ, దాన్యాయిగూడెం విద్యార్థులు నిలిచారు.

టెన్నీకాయిట్‌లో : ప్రథమ, ద్వితీయ స్థానాలు పాల్వంచ, దాన్యాయిగూడెం.

టెన్నీకాయిట్‌లో : ప్రథమ, ద్వితీయ స్థానాల్లో అంబేద్కర్ కాలేజీ, ఎర్రుపాలెం నిలిచాయి.

బాల్ బాడ్మింటన్‌లో : ప్రథమ, ద్వితీయస్థానాల్లో వైరా, మధిర నిలిచాయి.

- ఇండివిడ్యుయల్ చాంపియన్ షిప్ అండర్-19 విభాగంలో ఎన్.సవిత(ఇల్లెందు) గెలుపొందారు.
- కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో కల్లూరు, టేకులపల్లి స్టూడెంట్స్ విజయం సాధించారు.
- ఖోఖో పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు స్థానాల్లో ములకలపల్లి, అంబేద్కర్ కాలేజీ స్టూడెంట్స్ విజయం సాధించారు.
- డిస్కోత్రోలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో డి.పావని (దాన్యాయిగూడెం), ఏం.అంజలి(నేలకొండపల్లి), బి.రూప(నేలకొండపల్లి) విజయం సాధించారు.
- హైజంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎన్.సరిత (ఇల్లెందు), బి.సంజన(ఇల్లెందు), డి.పూజశ్రీ(ములకలపల్లి)విజయం సాధించారు.

అనారోగ్యంతో సహాయ గణాంక అధికారి కరీం మృతి


కరీం (ఫైల్)

భద్రాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై సహాయ గణాంక అధికారిగా పనిచేస్తున్న ఎస్‌కె కరీం(59) అనారోగ్య సమస్యలతో శనివారం మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బూర్గంపాడు మండలం అంజనాపురం స్వగ్రామంలో మృతి చెందారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని వాజేడు ఆశ్రమ పాఠశాలలో 1998వ సంవత్సరంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి అనంతరం భద్రాచలం ఐటీడీఏ పీవోలకు సీసీగా 18ఏళ్ల పాటు పనిచేసి వారి మన్ననలు పొందారు. ఇదిలా ఉండగా కరీం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఇతర అధికారులు, ఉద్యోగులు సంతాపం తెలిపారు. కాగా అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేలు ఆయన కుమారుడికి అందజేశారు.

విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న పామాయిల్ చెట్ల నరికి వేత

చంద్రుగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లకు పామాయిల్ చేట్లు అడ్డుగా ఉన్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది నరికివేసి ఘటన తిప్పనపల్లి గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాధిత రైతు అంచ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పామాయిల్ చెట్లు తాకి విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని చుంచుపల్లి మండలం పెనగడపకు చెందిన విద్యుత్ శాఖ సిబ్బంది రైతుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా శుక్రవారం సాయంత్రం 13 చెట్ల కొమ్మలను నరికి వేశారు. కాపుతో (గెలలతో) ఉన్న చెట్లను ధ్వంసం చేయటం పట్ల రైతు సత్యనారాణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సిబ్బందిపై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆయన ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపాడు.



ఎన్టీఆర్ విగ్రహ శిలాఫలకానికి మరమ్మతులు చేయాలి

ఖమ్మంమామిళ్లగూడెం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. విగ్రహానికి చుట్టూ ఉన్న శిలాఫలకాలు దెబ్బతిన్న విషయాన్ని ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న శిలాఫలకాలను, చుట్టూ ఉన్న కాంపౌండ్ లైట్లు ఏర్పాటు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. ఆయన వెంట కేతినేని హరీష్ చంద్ర, ఆళ్ల అంజి రెడ్డి, చింతనిప్పు నాగేశ్వరరావు, కొలికొండ మురళి, కాసాని బ్రహ్మం, జి.రవీందర్, తాళ్లూరి నారాయణరావు తదితరులు ఉన్నారు

రమణతండా-ములకలపల్లి రోడ్డు అధ్వానం

తిరుమలాయపాలెం, నవంబరు8(ఆంధ్రజ్యోతి) మండలంలోని రమణతండా నుంచి ములకపల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు రెండున్నర కిలోమీటర్ల వరకు ఉన్న ఈ రహదారి రాళ్లురప్పలు,పెద్ద పెద్దగుంతలు ఏర్పడి కనీసం నడవడానికి వీలులేదు. దీంతో ఈప్రాంతావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రమణతండావాసులు ములకలపల్లి వెళ్లాలంటే తిరుమలాయపాలెం వచ్చి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రమణతండవాసులకు ములకలపల్లి వైపు వెళ్లే రోడ్డుప్రక్కన భూములున్నాయి. నిత్యం ఈప్రాంతంనుంచి రాకపోకలు సాగిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు. పెద్దపెద్దగుంతలు ఏర్పడ్డాయి. దీంతో నరకయాతనపడుతన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.


రమణతండా-ములకలపల్లి రహదారి

ఇబ్బందులు పడుతున్నాం: రామావత్ బాలు



రమణతండానుంచి ములకలపల్లి వరకు రహదారి సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులుపడుతున్నాం. ఈరోడ్డుపై ప్రయాణించాలంటే తీవ్ర ఇక్కట్లకు గురికావాల్సిన పరిస్థితి రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడి దృష్టి సారించి బాగు చేయాలని కోరారు.

డివైడర్లలో మొక్కలపై శ్రద్ధ

» ఆవుపేడ ద్రావణం ఎరువుగా వాడకం
» 15రోజులకు ఒకసారి డివైడర్లలో మొక్కలకు అందజేత

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో మొక్కలు నాటటమే కాకుండా వాటి సంరక్షణకు కేఎంసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వేసవి కాలంలోనే నగరంలోని డివైడర్లలో మొక్కలను పూలతో అందంగా పెంచి ప్రజల మన్ననలను పొందారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఇప్పుడు డివైడర్లలోని మొక్కలకు ఆవుపేడతో కంపోస్టు ఎరువులను అందిస్తున్నారు. గతంలో వర్మి కంపోస్టుతో అధిక వ్యయం కాగా ఇప్పుడు వినూత్నంగా నగరంలోని గోశాల ల నుంచి ఆవుపేడను తెప్పించి కంపోస్టుగా అందిస్తున్నారు.ఖమ్మం నగరంలో కాల్వోడ్డు నుంచి ఎంబీగార్డెన్ వరకు, మయూరి సెంటర్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు, టూటౌన్ నుంచి శ్రీశ్రీ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ నుంచి వీ వెంకటాయపాలేం, రాపర్తినగర్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి బల్లేపల్లి వరకు, బల్లేపల్లి నుంచి రఘునాథపాలెం మండలంలోని యాపిల్ సెంటర్ వరకు, ముస్తాఫానగర్ సెంటర్ నుంచి అగ్రహారం గేటు వరకు. ప్రకాశ్‌నగర్ వంతెన నుంచి చర్చికాంపౌండ్ వరకు మొత్తం 32 కిలోమీటర్లు మేర డివైడర్లు వ్యాపించి ఉన్నాయి. వీటి నిర్వాహణకు కేఎంసీ ఉద్యాన విభాగం ప్రత్యేకంగా పర్యవేక్షణ చస్తోంది. అయితే మొక్కలు వేపుగా పెంచేందుకు గతంలో వర్మీ కంపోస్టును వేశారు. కేఎంసీ ఉద్యాన విభాగానికి అధిక భారం కావటంతో ఇప్పుడు ప్రత్యేక కార్యచరణ చేశారు.


ఆవుపేడను సేకరిస్తున్న కార్మికులు, కంపోస్టును కలుపుతున్న కార్మికుడు, మొక్కలకు కంపోస్టు పోస్తున్న కార్మికుడు

ఆవుపేడతో కంపోస్టు

ఖమ్మం నగరంలో గోశాలలు ఉన్నాయి. వాటి నుంచి ఆవుపేడను సేకరిస్తున్నారు. ఉద్యాన విభాగానికి అందుబాటులో ఉన్న నీటి ట్యాంకర్లలో ఆవుపేడను కలిపి కంపోస్టుగా తయారు చేస్తున్నారు. ఆలా తయారైన కంపోస్టు ద్రావణాన్ని డివైడర్లలోని మొక్కలకు పోస్తున్నారు. పక్షం రోజులకు ఒకసారి డివైడర్లలోని మొక్కలకు ఆవుపేడ కంపోస్టును అందిస్తున్నారు. దీంతో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయని ఉద్యన అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాక చీడపీడల నుంచి కూడా రక్షణ ఉంటుందని చెప్పారు.

విద్యార్థులకు అండగా తుమ్మల యువసేన


బ్యాగులు అందించిన యుగంధర్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అకాల వర్షాల ప్రభావంతో జలగం నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ముంపునకు గురైంది. దీంతో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు అధికారులు అరెంపులలోని మహమ్మదీయ కాలేజీ వద్దకు తరలించారు. పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదల అవసరాన్ని గుర్తించిన కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు తుమ్మల యుగంధర్ సొంత ఖర్చుతో నోట్ బుక్స్ అందజేశారు. శుక్రవారం ఆయన పాఠశాలకు వెళ్లి విద్యార్థులను స్వయంగా పలకరించారు. తుమ్మల యువసేన తరఫున 250స్కూల్ బ్యాగ్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఒక్కొక్కరితో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా ప్రమాణాల పెంపుకు సూచనలు చేశారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

రాష్ట్ర పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ



ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెరిక కులసమగ్ర కుటుంబ సర్వే విభాగ కోఆర్డినేటర్‌గా సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జవెల్లి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం హైదరాబాదులో సంఘం రాష్ట్రఅధ్యక్షుడు ఘటిక విజయ్‌కుమార్ నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెరిక కులస్తులందరు అన్ని జిల్లాల నుంచి తమపేరు,వృత్తి, చిరునామా తదితర వివరాలతో నమోదు చేయించుకోవాలని కోరారు. నమోదు చేసుకున్న సమాచారాన్ని పెరిక సంఘం వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు.

14న జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

కల్లూరు,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఈనెల 14న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలుర అండర్14 విభాగంలో ఖోఖో క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహక కార్యదర్శిలు బోడా భీమా, పసుపులేటి వీరరాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలం నుంచి 12 మంది క్రీడాకారులను మాత్రమే తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు సంబంధించి అర్హత గల ధృవీకరణపత్రము, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, వయస్సు (01-1-2012 తర్వాత జన్మించిన వారు) ధృవీకరణ పత్రములను వెంట తీసుకోని రావాలని వారు తమ ప్రకటనలో కోరారు. విద్యార్థులు 6, 7, 8, 9 తరగతులకు చెందిన వారు మాత్రమే అర్హులను పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో న్యూఇరా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సౌత్‌జోన్‌స్థాయి క్రీడాపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అండర్ -14, 17 విభాగాల్లో పతకాలు సాధించారని పాఠశాల ఛైర్మన్ ఐవి. రమణారావు, డైరెక్టర్ భూమేశ్వరరావు తెలిపారు. అండర్-17బాలికల ఖో-ఖోలో ప్రథమ, అండర్-14, 17బాలికల వాలీబాల్‌లో ద్వితియ స్థానాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. పలువురు జిల్లా స్థాయి పోటీలకు సైతం ఎంపికైనారని తెలిపారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌లో సర్వజ్ఞ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో హైదరఆబాద్ శుక్రవారం నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో ప్రతిభ చాటారని పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ అన్నారుస్కిట్ విభాగంలో ఉమ్మడి జిల్లాల విద్యార్థులతో పోటీ పడి నాలుగో స్థానంలోనిలిచారన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ వీరిని అభినందించారు.

టీయూసీఐ శిక్షణను విజయవంతం చేయండి

ఏరియా కార్యదర్శి రాందాసు

నేలకొండపల్లి,నవంబరు8(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని శ్రీకర గార్డెన్స్‌లో ఆదివారం జరుగనున్న టీయూసీఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని టీయూసీఐ ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రాందాసు పిలుపునిచ్చారు. శనివారం నేలకొండపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో రాందాసు మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కార్మికవర్గం కర్తవ్యాలు, భారత కార్మికోద్యమ చరిత్ర, టీయూసీఐ నిర్మాణం, పనివిధానం తదితర అంశాలపై నాయకులు తరగతులను బోధిస్తారన్నారు. ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కుల కోసం మరో పోరాటం చేయటానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని రాందాసు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. 8గంటల పనికి బదులుగా 10 గంటల పని విధానం తెచ్చిందని, 10 గంటల పని విధానాన్ని వెంటనే రద్దు చేయాలని రాందాసు డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా

28వడివిజన్ కార్పొరేటర్ లక్ష్మీ


విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ, నాయకులు వెంకన్న

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించటమే కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటుందని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటుగా సమస్యలను పరిష్కరిస్తున్నామని 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ పేర్కొన్నారు. శనివారం డివిజన్‌లో విద్యుత్ స్థంభాల నిర్మాణాల కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. కొన్నేళ్లగా కుమ్మరి బజార్‌లో విద్యుత్ స్థంభాల సమస్య ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. నాయకులు గజ్జల వెంకన్న తదితరులు పాల్గొన్నారం

వేపకుంట్లలో అమరవీరుల వర్ధంతి సభ



రఘునాథపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాలతో ఇప్పుడు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని అని మాస్‌లైన్ నాయకులు పేర్కొన్నారు. శనివారం వేపకుంట్ల పార్టీ కార్యాలయంలో అమరవీరుల వర్ధంతి సభను నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నవంబరు1 నుంచి 9 వరకు సభలు నిర్వహించటం అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళులు అని పేర్కొన్నారు. నాయకులు నర్స య్య, రామనాథం, బాబు, లేళ్ల రాంబాబు, మేక పిచ్చయ్య, స్టాలిన్, కళావతి, ప్రశాంత్, సునీల్, ఇజ్రాయిల్, కృష్ణ, రాయప్ప, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేరడలో చోరీ

చింతకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడలో గంగుల సాయిరాం ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. సాయిరాం ఖమ్మంలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగానికి వెళ్లారు. ఆయన తల్లి వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పగలకొట్టి రూ.1.56 లక్షల నగదు, బంగారం, వెండి, ఆభరణాలు అపహరించనట్లు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఘనంగా గుండాల కృష్ణ జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న కృష్ణ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త గుండాల కృష్ణ జన్మదిన వేడుకలు శనివారం ఎస్‌బీఐటీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో ఘనంగానిర్వహించారు. ఖమ్మంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి పేదవిద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్యను దగ్గర చేశారని అతిథులు,అధ్యాపకులు కొనియాడారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, హెచ్‌ఓడీలు, డైరెక్టర్ల సమక్షంలో గుండాల కృష్ణ కేక్ కట్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈకార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవీవీ. శివ ప్రసాద్, జె.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికే ప్రభుత్వ ప్రాధాన్యం

» కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రజలసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యతని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసిన నాయకులు కార్యకర్తలకు తినిపించారు.కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకుడు ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, చాకమూరి రమేశ్, భూక్య సురేశ్ నాయక్, కొప్పెర ఉపేంద్ర, ఉమ్మినేని కృష్ణ, గురుమూర్తి, సైదులు, శ్రీకళారెడ్డి పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న తుంబూరి దయాకర్‌రెడ్డి

క్యాన్సర్ చికిత్సా కేంద్రం ప్రారంభం


క్యాన్సర్ చికిత్స కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసకుమార్

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా 4 డీట్రూ బీమ్ రేడియేషన్ థెరపీ మెషిన్ ఖమ్మం నగరంలో క్యాన్సర్ చికిత్స కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జెమ్‌కేర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ రావిపాటి శ్రీనివాసకుమార్ తెలిపారు. శనివారం ఖమ్మంలో జెమ్‌కే ర్ ఆధ్వర్యంలో క్యాన్సర్ చికిత్సా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్స కోసం ప్రత్యేక ఆస్పత్రి లేకపోవడంతో, రోగులు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందాల్సి వచ్చిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా 4డీట్రూ బీమ్ రేడియేషన్ థెరపీ మెషిన్‌ను జెమ్ కేర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ (ఆరోగ్య హాస్పిటల్ ప్రాంగణంలో) అందుబాటులోకి తెచ్చామన్నారు. అత్యాధునిక రేడియేషన్ ట్రీట్ మెంట్ టెక్నాలజీతో పనిచేస్తుందన్నారు. అధునాతన పీఈటీ- సీటీ స్కాన్ కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జెమ్ కేర్ సీనియర్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ సుధాకర్ కె, డాక్టర్ సుమంత్ బాబు మాట్లాడుతూ క్యాన్సర్‌కు అవగాహనే ప్రథమ ఆయుధం అని ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చన్నారు. అవగాహన లేమి వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల చాలామంది రోగులు మూడోలేదా నాలుగో దశలో మాత్రమే ఆస్పత్రులకు వస్తున్నారు. దీనితో వారికి చికిత్స కష్టతరమవుతుందన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో మరింత అవగాహనా పెంపొందించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫీజిషన్ డాక్టర్ ఎస్‌వి చంద్రశేఖర్,సీఈవోశ్రీకాంత్ నంబూరి, సీఎంవో దినేష్ పాల్గొన్నారు.

తొమ్మిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మధిరరూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మధిర మండలం బుచ్చిరెడ్డిపాలెం రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి మధిర రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. గత కొన్నిరోజులుగా ఈ ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను శనివారం రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

ఎంజాయ్‌మెంట్ సర్వే షురూ

» భూభారతిలో మరో ముందడుగు
» రీసర్వేకోసం నాలుగు రెవెన్యూ పైలెట్ గ్రామాల ఎంపిక


సర్వే చేస్తున్న మండల సర్వే బృందం (ఫైల్)

ఎర్రుపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం ద్వారా ఇప్పటికే రీ సర్వే కోసం రాష్ట్రంలో 5గ్రామాలను ఎంచుకుని సర్వే పూర్తిచేసింది. ఆ గ్రామాల్లో అక్షాంశాలు, రేఖాంశాలు లతో సహానక్షాలు, సర్వేమ్యాపులను రూపొందించి భూదార్ కార్డులు జారీ చేసేందుకు రెవెన్యూశాఖ అంతా సిద్ధం చేసింది. కాగా మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు 70గ్రామాలను ఎంపికచేసి ఎంజాయ్మెంట్ సర్వేనిర్వహించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. దానిలో భాగంగా మండలానికి 4నుంచి 5 రెవెన్యూగ్రామాలను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దీనిలో భాగంగా ఎర్రుపాలెం మండలంలో 4 రెవెన్యూ గ్రామాలను ఎంపికచేసి రీసర్వే నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. వాస్తవానికి 30ఏళ్లకోసారి భూముల రీసర్వే జరగాల్సి ఉన్నా ఇప్పటి వరకు రీసర్వే ఊసేలేకపోవడంతో భూతగాదాలు, భూసమస్యలు పెరిగిపోయాయి. దాదాపుగా అన్ని జిల్లాల్లో, మండలాల్లో భూములకు సంబంధిచి సరిహద్దుల వివరాలు, సర్వేనెంబర్లు బైనెంబర్లు సరిగా లేకపోవడంతో అధికారులుకు తలనొప్పిగా మారింది. రికార్డుల్లో ఓ రకంగా క్షేత్రస్థాయిలో మరో రకంగా సరిహద్దులు ఉండడంతో ఎన్నో వివాదాలు తలెత్తుతున్నాయి. ఎక్కడికక్కడ భూసమస్యలు పేరుకుపోవడంతో భూములను రీసర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సర్వేతో భూ హద్దుల సమస్యలకు చెక్

నిజాం పాలనలో గొలుసుల ద్వారా భూములకు కొలతలు వేసి ప్రతి గ్రామానికి టిప్పన్ నక్షా తయారుచేసిన విషయం తెలిసిందే. ఇప్పటికీ రెవెన్యూ శాఖ మొదలు కోర్టుల వరకు అదేనక్షా ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. టిప్పన్ నక్షాలో సర్వేనెంబర్ల ప్రకారం భూమి విస్తీర్ణం, కాలిబాటలు, రోడ్లు, డొంకలు, వాగులు, గ్రామకంఠం ఎంతమేర ఉందనే వివరాలు ఉంటాయి. కొన్ని దశాబ్దాలుగా వీటినే ఆధారం చేసుకుని భూముల కొలతలను పరిగణలోకి తీసుకుంటున్నారు. వీటిని తయారుచేసి దశాబ్దాలుదాటిపోతుండడంతో ఈనక్షాలు పాడైపోయాయి. వీటిని భద్రంగా కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలోనే డిజిటలైజేషన్ చేశారు. అయినప్పటికీ గ్రామాల్లో ఇప్పటికి భూహద్దులు, విస్తీర్ణంపై వివాదాలు కోకొల్లలుగా నడుస్తూనే ఉన్నాయి. దీంతో భూ భారతిద్వారా భూసమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూశాఖ భూముల రీసర్వే చేయాలని నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో భూముల కొలతలు నిర్ధారించడానికి రాష్ట్రవ్యాప్తంగా మరలా కొన్ని పైలెట్‌గ్రామాలు ఎంచుకుని ఎంజాయ్మెంట్ సర్వేద్వారా భూభారతిలో మరో మందడుగు వేయడానికి చూస్తోంది. భూమికొలతలు, రికార్డుల శాఖ ఆధ్వర్యంలో భూముల రీసర్వే ప్రక్రియను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దీని కోసం శాటిలైట్ సహకారం తీసుకోనున్నారు. జీపీఎస్ పద్ధతిలోపాత రికార్డుల ఆధారంగా అప్పటి మ్యాపులను పరిశీలిస్తూ రీసర్వే చేపట్టనున్నారు. భూముల రీసర్వే చేసే విధానంపై ఇటీవల హైదరాబాద్‌లోని సర్వేభవన్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. ఎర్రుపాలెం మండలంలో రంగగూడెం, కాచవరం, త్రిపురారం, తాటిగూడెం నాలుగురెవెన్యూ గ్రామాలలో 220 సర్వేనెంబర్లలో 4921 ఎకరాలు రీసర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులు ప్రతిపాదించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నాలుగు గ్రామాలకు సంబంధించి భూముల పాత, కొత్తరికార్డులు, మ్యాపుల ప్రకారం క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఈ సర్వే చేపట్టనున్నారు. తద్వారా సరిహద్దు సమస్యలు, భూమితగ్గుదల, ఆన్‌లైన్‌లో నమోదు కానీ విస్తీర్ణాన్ని నమోదు చేయడం, పాత భూరికార్డుల ప్రక్షాళన వంటి భూసమస్యలు తీరనున్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పంచాయతీ రాజ్ డీఈకి ఘన సన్మానం

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో పలు శివాలయాలకు రహదారుల నిర్మాణానికి కృషి చేసిన పంచాయితీరాజ్ డీఈ కదారి వెంకటేశ్వరరావును గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ రహదారుల నిర్మాణంలో తన వంతుగా కృషి చేసి త్వరతగతిన పూర్తి చేసినందకు డీఈ వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా ఆహ్వానించి గ్రామస్థులు సన్మానించారు. ప్రస్తుతం వెంకటేశ్వరరావు డిఈగా వైరా సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్నారు. ఆలయాల ధర్మకర్తలు వెంకటకృష్ణప్రసాద్, శ్రీనివాస్, రిటైర్డు ఆర్‌అండ్‌బి విశ్రాంత సీఈ గుజ్జు చిన్నపుల్లాదాసు, చినాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలి

» సింగరేణి జీఎం చింతల శ్రీనివాస్



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న సింగారేణి జీఎం శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అందిస్తున్న సహకారంతో విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో మండలంలోని కిష్టారం గ్రామంలలోని 3మండల ప్రాథమిక పాఠశాలకు చెందిన 135 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్స్, షూస్, సాక్స్, టై, బెల్ట్‌లను శనివారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం ఎంవీ.నరసింహారావు, నరుకుళ్ల రవికుమార్, జనార్ధన్, కే.శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

చలినేస్తాలకు భలేగిరాకీ..

» రూ.100నుంచి.. రూ.2వేల వరకు ధర

» మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి వచ్చిన చిరు వ్యాపారులు

సత్తుపల్లిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత నెల నుంచి అకాలవర్షాలతో పాటు ఎండవెడిమితో ఉక్కిరిబిక్కిరి అవ్వగా గత వారం నుంచి చలికాలం వచ్చినట్లే వాతావరణం కనిపిస్తోంది. దీంతో చలికాలం రానేవచ్చింది.. వెచ్చని నేస్తాలైన ఉన్ని దుస్తులూ వచ్చిపడ్డాయి. సత్తుపల్లిలోని జాతీయ రహదారికి ఇరువైపులా షెడ్లువేసి ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి ఈ ఉన్ని దుస్తులను విక్రయిస్తున్నారు. రోజురోజుకూ చలితీవ్రత పెరగనుండగా చలితీవ్రత నుంచి కాపాడుకునేందుకు ఇక్కడి ప్రజల అవసరాలను గుర్తించిన మధ్యప్రదేశ్, రాజస్థాన్ వాసులు నియోజకవర్గ కేంద్రంలో దుకాణాలను ఏర్పాటు చేశారు. దుకాణాల్లో రంగురంగుల ఉలాన్ స్వెట్టర్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. నేపాల్, పంజాబ్, టిబెట్, తదితర ప్రాంతాల నుంచి తెప్పించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



రంగురంగుల చిన్నారుల మంకీ క్యాప్‌లు



సత్తుపల్లి సెంటర్‌లో చలినేస్తాల దుకాణాలు

ఇక్కడ మాకు మంచి డిమాండ్
బహదూర్ సింగ్, మధ్యప్రదేశ్ వాసి



తెలంగాణలో మేం నాణ్యమైన ఉన్ని దుస్తులను విక్రయిస్తుండడంతో మాకు మంచి డిమాండ్ ఉంది. మా దగ్గర చిన్నాపెద్దా తేడాలేకుండా అందరికీ రూ.100నుంచి రూ.2వేల వరకు ఉన్ని దుస్తులు వివిధ రకాల్లో ఆకర్షణీయమైన డిజైన్లలో అందుబాటులో ఉన్నాయి. ఎక్స్‌ఎల్, డబుల్, త్రిబుల్ ఎక్స్‌ఎల్ సైజ్‌ను బట్టి స్వెట్టర్లతో పాటు శాలువాలు, రగ్గులు, గ్లౌజులు, క్యాప్‌లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లు, చలికోట్లు లభిస్తాయి. చలితో పాటు వర్షానికి కూడా తట్టుకునేలా టూ ఇన్ వన్ రకాలు అందుబాటులో ఉన్నాయి. చిన్నారులను ఆకర్షించేలా పలు చోటాభీమ్, డోరేమాన్, చిన్‌చాన్, లిటిల్ సింగం తదితర రకాల జంతువుల బొమ్మలతో కూడిన స్వెట్టర్లు లభిస్తున్నాయి. అదేవిధంగా మహిళలు, వృద్ధులు, యువతకు అనుకూలమైన బటన్, జిప్, బనియన్ టైర్ రకాలు వివిధ రంగుల్లో అమ్మకానికి పెట్టాం.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



ఏన్కూరు బీసీ హాస్టల్ ఆరణలో మొక్కలు నాటుతున్న సాంబయ్య

ఏన్కూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని ఏన్కూరుకు చెందిన వన ప్రేమికుడు కొంటు సాంబయ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం బీసీ హాస్టల్ ఆవరణ పరిధిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానురాను వాతావరణ కలుషితమై మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తంచేవారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శోభన్‌నాయక్, గణేష్, చారి, నాగరాజు, బాబులాల్, సీత తదితరులు పాల్గొన్నారు.

కుర్నవల్లిలో వరి క్షేత్ర ప్రదర్శన

తల్లాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో శనివారం ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాణ్యమైన సిద్ధి రకం వరిక్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా కుర్నవల్లి గ్రామంలో అయిలూరి కోటిరెడ్డి అనే రైతు వానాకాలం సీజన్‌లో సాగుచేసిన వరంగల్ 44 సిద్ధి రకం వరి క్షేత్రాన్ని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ టి.పావని, అభ్యుదయ రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా సాగురైతు కోటిరెడ్డి తన అనుభవం వివరిస్తూ సిద్ధి రకం వరిసాగు వానాకాలం సీజన్‌లో చౌడు, ఉల్లికోడును తట్టుకునే సన్నగింజ రకమని తెలిపారు. వచ్చే ఏడాది వానాకాలం సీజన్‌లో పెద్దఎత్తున ఈ రకం విత్తనతంతో వరిసాగుకు గ్రామరైతులు సన్నద్ధమవుతున్నారని వివరించారు.

కుర్నవల్లి రైతులకు ఉత్తమ పురస్కారం

తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన రైతు అయిలూరి కోటిరెడ్డి ఉత్తమ రైతు పురస్కారాన్ని అందకున్నారు. హైదరాబాదు రాజేంద్రనగర్‌లో భారతీయ వరి పరిశోధనా స్థానంవారు కోటిరెడ్డికి ఉత్తమ రైతు పురస్కారం బహూకరించారు. నేరుగా వరివిత్తే విధానంలో సాగుచేసి నూతన వరి వంగడాలను ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం అవలంబిస్తూ మంచి దిగుబడులుసాధిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకుగాను ఉత్తమ రైతు పురస్కారం అందించి ఘనంగా సన్మానించారు.

నేరడలో చోరీ

చింతకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడలో గంగుల సాయిరాం ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. సాయిరాం ఖమ్మంలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగానికి వెళ్లారు. ఆయన తల్లి వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పగలకొట్టి ఇంట్లో ఉన్న రూ 1.56 లక్షల నగదు, బంగారం, వెండి, ఆభరణాలు అపహరించనట్లు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని 33/11కేవీ ఐపీడీఎస్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్ ఏఈ ఉబ్బన శరత్‌బాబు శనివారం తెలిపారు. తాళ్లమడ అగ్రికల్చర్ ఫీడర్, తాళ్లమడ ఎక్స్‌ప్రెస్ ఫీడర్ సబ్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం సప్లయ్‌కు అంతరాయం ఏర్పడనుండగా వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

» టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

ముదిగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ముదిగొండలో శనివారం జరిగిన యూటీఎఫ్ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించే విధంగా విద్యా హక్కు చట్టాన్ని సవరణ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులకు అభ్యర్థులు లేక ఆ పోస్టులు ఖాళీగా మిగులుతున్నందున సర్వీస్ రూల్స్‌ను సవరించి ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డైట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రాంబాబు, జగదీశ్వర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకుడు ససేంద్రబాబు, నాయకులు సురేష్, రాందాస్, సుధాకర్, శైలేంద్ర, జహీద్, సుధాకర్, కవిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

తొమ్మిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మధిర రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం బుచ్చిరెడ్డిపాలెం రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. గత కొన్నిరోజులుగా ఈ ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను శనివారం రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.



మధిర పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఐటీ స్లాబ్‌లను సవరించాలి

మధిర రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట భారంగా మారిన ఐటీ స్లాబ్‌లను సవరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం మధిరలో సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షుడు షేక్.రంజాన్‌లు మాట్లాడారు. కేంద్రం రెండేళ్లపాటు ఆలస్యంగా ఏర్పాటు చేసిన 8వ వేతన సంఘం నియామకంలోని నిబంధనలు పీఆర్సీ డీఏ పెంపుదల వర్తించకపోవడం పెన్షనర్ల పాలిట శాపంగా మారాయన్నారు. ఐటీ స్లాబులు సవరించాలని, టెట్ సమస్య పరిష్కారానికి విద్య హక్కు చట్టంలోని 23ను సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. విద్యారంగ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల పాలిట ఈరకమైన వైఖరి సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు షేక్.నాగూర్‌వలీ, అనుమోలు కోటేశ్వరరావు, గుగులోతు రామకృష్ణ, నాయకులు ఏ.వినోదరావు, ఆర్.లక్ష్మణ్‌రావు, మీరాఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

14న జిల్లా స్థాయి బాలుర ఖోఖో పోటీలు

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఈ నెల 14న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలుర అండర్14 విభాగంలో ఖోఖో క్రీడ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఖోఖో పోటీల నిర్వహక కార్యదర్శిలు బోడా భీమా, పసుపులేటి వీరరాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలం నుంచి 12 మంది క్రీడా కారులను మాత్రమే వెంట తీసుకోని రావాలని వ్యాయమా ఉపాధ్యాయులను కోరారు. పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులకు సంబంధించి అర్హత గల ధృవికరణపత్రము, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, వయస్సు (01-1-2012 తర్వాత జన్మించిన వారు) ధృవీకరణ పత్రములను వెంట తీసుకోని రావాలని వారు తమ ప్రకటనలో కోరారు. విద్యార్థులు 6, 7, 8, 9 తరగతులకు చెందిన వారు మాత్రమే అర్హులను పేర్కొన్నారు. ఖోఖో శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామదర్శకులు అందరూ కూడా పై తేదిలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం పలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.



తల్లాడలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కారేపల్లిలో..



ముదిగొండలో..

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాలకవచాన్ని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శనివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది ఉచితంగా అన్నవితరణ చేశారు.

ఈకార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, ముఖ్య అర్చకులు రఘురామకృష్ణ, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



శ్రీవారి పాదం వద్ద కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీఎంను కలిసిన ప్రభావతిరెడ్డి

ఏన్కూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం మండల కాంగ్రెస్‌పార్టీ మహిళ అధ్యక్షురాలు కొప్పుల ప్రభావతిరెడ్డి శనివారం సీఎంని హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మహిళలసమస్యలను వివరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ట్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తప్పక విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.



కార్మిక వ్యతిరేక విధానాలతో భారంగా బతుకులు: సీఐటీయూ

సత్తుపల్లిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల మూలంగా వారి బ్రతుకులు భారంగా మారాయని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. సీఐటీయూ సత్తుపల్లి పట్టణ 8వ మహాసభ శనివారం సత్తుపల్లిలోని కళాభారతిలో నిర్వహించారు. అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాసిందని, దీంతో 8గంటల పనివిధానాన్ని 12-14గంటలకు పెంచడంతో కార్మికవర్గం తీవ్రంగా ఇబ్బందులకు గురవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, రిజిస్ట్రేషన్ అవకాశాలు కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోగా పట్టణ కన్వీనర్‌గా కొలికపోగు సర్వేశ్వరరావు, కో-కన్వీనర్‌గా చెరుకూరి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న సీఐటీయూ సభ్యుడు విఠల్‌రావు

కారేపల్లి మాజీ సర్పంచ్ బోడ కన్నుమూత

కారేపల్లి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి గ్రామమాజీ సర్పంచ్ బోడ మోహన్‌కృష్ణ(62)శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన మోహన్‌కృష్ణను వారం రోజులక్రితం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతున్న సమయంలో గుండెపోటు వచ్చి మృతిచెందిన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మోహన్‌కృష్ణ తన పదవీకాలంలో గ్రామాభివృద్ధికి కృషిచేశారని పలువురు అన్నారు. మోహన్‌కృష్ణ మృతివార్త తెలుసుకున్న పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యాకర్తలు మోహన్‌కృష్ణ భౌతికాయాన్ని సందర్శించి నివాళ్ళులర్పించారు. మృతుడుకు భార్య, కూతురు ఉన్నారు.



ఎంజాయ్‌మెంట్ సర్వే షురూ

» భూభారతిలో మరో ముందడుగు

» రీసర్వేకోసం నాలుగు రెవెన్యూ పైలెట్ గ్రామాల ఎంపిక

ఎర్రుపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం ద్వారా ఇప్పటికే రీ సర్వే కోసం రాష్ట్రంలో 5గ్రామాలను ఎంచుకుని సర్వే పూర్తిచేసింది. ఆ గ్రామాల్లో అక్షాంశాలు, రేఖాంశాలులతో సహానక్షాలు, సర్వేమ్యాపులను రూపొందించి భూదార్ కార్డులు జారీ చేసేందుకు రెవెన్యూశాఖ అంతా సిద్ధం చేసింది. కాగా మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు 70గ్రామాలను ఎంపికచేసి ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. దానిలో భాగంగా మండలానికి 4నుంచి 5 రెవెన్యూగ్రామాలను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దీనిలో భాగంగా ఎర్రుపాలెం మండలంలో 4 రెవెన్యూ గ్రామాలను ఎంపికచేసి రీసర్వే నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. వాస్తవానికి 30ఏళ్లకోసారి భూముల రీసర్వే జరగాల్సి ఉన్నా ఇప్పటి వరకు రీసర్వే ఊసేలేకపోవడంతో భూతగాదాలు, భూసమస్యలు పెరిగిపోయాయి. దాదాపుగా అన్ని జిల్లాల్లో, మండలాల్లో భూములకు సంబంధిచి సరిహద్దుల వివరాలు, సర్వేనెంబర్లు బైనెంబర్లు సరిగా లేకపోవడంతో అధికారులుకు తలనొప్పిగా మారింది. రికార్డుల్లో ఓ రకంగా క్షేత్రస్థాయిలో మరోరకంగా సరిహద్దులు ఉండడంతో ఎన్నో వివాదాలు తలెత్తుతున్నాయి. ఎక్కడికక్కడ భూసమస్యలు పేరుకుపోవడంతో భూములను రీసర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.



సర్వే చేస్తున్న మండల సర్వే బృందం (ఫైల్)

సర్వేతో భూ హద్దుల సమస్యలకు చెక్

నిజాం పాలనలో గొలుసుల ద్వారా భూములకు కొలతలు వేసి ప్రతి గ్రామానికి టిప్పన్ నక్షా తయారు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికీ రెవెన్యూ శాఖ మొదలు కోర్టుల వరకు అదేనక్షా ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. టిప్పన్ నక్షాలో సర్వేనెంబర్ల ప్రకారం భూమి విస్తీర్ణం, కాలిబాటలు, రోడ్లు, డొంకలు, వాగులు, గ్రామకంఠం ఎంతమేర ఉందనే వివరాలు ఉంటాయి. కొన్ని దశాబ్దాలుగా వీటినే ఆధారం చేసుకుని భూముల కొలతలను పరిగణలోకి తీసుకుంటున్నారు. వీటిని తయారుచేసి దశాబ్దాలుదాటి పోతుండడంతో ఈనక్షాలు పాడైపోయాయి. వీటిని భద్రంగా కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలోనే డిజిటలైజేషన్ చేశారు. అయినప్పటికీ గ్రామాల్లో ఇప్పటికి భూహద్దులు, విస్తీర్ణంపై వివాదాలు కోకోల్లలుగా నడుస్తూనే ఉన్నాయి. దీంతో భూభారతిద్వారా భూసమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూశాఖ భూముల రీసర్వే చేయాలని నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో భూముల కొలతలు నిర్ధారించడానికి రాష్ట్రవ్యాప్తంగా మరలా కొన్ని పైలెట్‌గ్రామాలు ఎంచుకుని ఎంజాయ్మెంట్ సర్వేద్వారా భూభారతిలో మరో మందడుగు వేయడానికి చూస్తోంది. భూమికొలతలు, రికార్డుల శాఖ ఆధ్వర్యంలో భూముల రీసర్వే ప్రక్రియను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దీని కోసం శాటిలైట్ సహకారం తీసుకోనున్నారు. జీపీఎస్ పద్ధతిలోపాత రికార్డుల ఆధారంగా అప్పటి మ్యాపులను పరిశీలీస్తూ రీసర్వే చేపట్టనున్నారు. భూముల రీసర్వే చేసే విధానంపై ఇటీవల హైదరాబాద్‌లోని సర్వేభవన్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. ఎర్రుపాలెం మండలంలో రంగగూడెం, కాచవరం, త్రిపురారం, తాటిగూడెం నాలుగురెవెన్యూ గ్రామాలలో 220 సర్వేనెంబర్లలో 4921 ఎకరాలు రీసర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులు ప్రతిపాదించారు. పైలెట్‌ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నాలుగు గ్రామాలకు సంబంధించి భూముల పాత, కొత్తరికార్డులు, మ్యాపుల ప్రకారం క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఈ సర్వే చేపట్టనున్నారు. తద్వారా సరిహద్దు సమస్యలు, భూమితగ్గదల, ఆన్‌లైన్‌లో నమోదు కానీ విస్తీర్ణాన్ని నమోదు చేయడం, పాత భూరికార్డుల ప్రక్షాళన వంటి భూసమస్యలు తీరనున్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పదోన్నతిపై కిష్టారం ఓసీ పీవో బదిలీ

» ఘనంగా సత్కరించిన గ్రామస్థులు

సత్తుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలోని కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గుగని ప్రాజెక్టు అధికారి నరసింహారావు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఆయన కిష్టారం ఓసీ నుంచి వీకే గని అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. గత మూడున్నరేళ్ళుగా ఆయన కిష్టారంలో పని చేయగా ఈ ప్రాంత భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారు. అటు సంస్థ అధికారులు, భూ నిర్వాసితులకు మధ్య వారధిగా ఉన్నారు. బొగ్గు లక్ష్యం మేరకు ఉత్పత్తి, రవాణాలో ఆయన కీలక పాత్ర పోషించారు. నరసింహారావు స్థానంలో కిష్టారం ఓసీ పీవోగా సునీల్ వర్మ రానున్నారు. పదోన్నతిపై బదిలీ అయిన నరసింహారావును గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తెమ్మతల్లి దేవస్థానం ఛైర్మన్ నరుకుళ్ల అప్పారావు, నరుకుళ్ల రవి, వెంకటేశ్వరరావు, తాళ్ల రమేష్‌లు పాల్గొన్నారు.



నర్సింహారావును సన్మానిస్తున్న కిష్టారం గ్రామస్థులు

వృద్ధులు, అనాథలకు రగ్గుల పంపిణీ



కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో శనివారం తొపుడుబండి ఫౌండేషన్ తరుపున వృద్ధులకు, అనాథలకు ఉచితంగా చలికాలం రగ్గులను ఆ సంస్థ అధినేత ఉషా సాధిక్‌అలీ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఉషా సాధిక్‌అలీ మాట్లాడుతూ.. చలి తీవ్రత పేరుగుతున్న తరుణంలో పేదలు, వృద్ధులు, అనాథలు చలికి తట్టుకోలేక ఆనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో వారికి కొంత వెచ్చదనం, మానవత్వపు మమకారం అందించేందుకు తొపుడు బండి ఫౌండేషన్ తరుపున ప్రతి ఏడాది చలికాలం సీజన్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని చెప్పారు. స్థానికంగా అంబేద్కర్‌నగర్, ముత్యాలమ్మవీధి వైపున గల సుమారు 250 మందికి సంస్థ తరపున రగ్గులు అందజేశారు. రంగారెడ్డి జిల్లా అమనగల్‌కు చెందిన దాత చంద్రమోహన్ పేదలకు రక్షణ కల్పించాలని ఆశయంతో ముందుకు వచ్చి వాటిని వితరణ చేయగా ఉషా సాదిక్‌అలీ వాటిని అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేదలు దాతలకు అబినందనలు తెలిపారు. తొపుడుబండి అర్గనైజర్స్ దయాల కిషోర్‌దత్, శ్యామల,నసీర్, మేరీగోల్డ్, వేణుపాల్గొన్నారు.